ఆదివారం

ప్రజాశక్తి

జూలై 13, 2008

భారత్ టెన్నిస్ ముద్దుబిడ్డ

సానియా

(13-7-2003నుండి
19-7-2003వరకు)

హ్యాపీ బర్త్‌డే

సృజన్
9సం॥, జులై-1994
మణి-రాంబాబు
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

పి.వైష్ణవిప్రియ
1సం॥, జులై-2002
మౌనిక-స్వామి
పొచ్చెర(దిమ్మ)-అదిలాబాద్

హిమని
2సం॥, జులై-2001
కృష్ణవేణి-శంకరయ్య
నల్లగొండ

రాజశేఖర్‌రెడ్డి
1సం॥, జులై- 2002
పద్మ-దుర్గారెడ్డి
నాంచారుపల్లి-మెదక్

బి.వి.మోహన్‌రావు
2సం॥, 13.7.2001
లక్ష్మి-బి.ఎన్.పి.కుమార్
సామర్లకోట-తూ॥గో॥

సాయిరాజారామ్‌కేశిక్
2సం॥, జులై-2001
రమాదేవి- హనుమంతరావు
ఒంగోలు-ప్రకాశం

కె.యు.ఎస్.దేవి
1సం॥, జులై-2002
వీరప్రభ-కె.వి.వి.ఎస్.మూర్తి
కొత్తపేట-తూ॥గో॥

డి.దినేష్
జులై
విజయమ్మ-రాజశేఖర్
కుటాగుళ్ళ-అనంతపురం

ఎ.పుష్పలత
10॥సం, 14.7.1993
విజయలక్ష్మి-వసంతరావు
ముషీరాబాద్-హైదరాబాద్

ఎన్.లతితేష్
2సం॥,14.7.2001
విజయలక్ష్మి-రమేష్
విశాఖపట్నం



జి.సాయినిఖిల్
5సం॥14.7.1998
పద్మశ్రీ-నర్సింహ
సనత్‌నగర్-హైదరాబాద్

ఎమ్.చంద్రశేఖర్
2సం॥, 14.7.2001
భాగ్యలక్ష్మి-సుబ్బారావు
నంబూరు-గుంటూరు

ఎమ్.హరిప్రియ
5సం॥, 15.7.1998
రజని-హరనాథ్
మచిలీపట్నం-కృష్ణ

ఎస్. అరవింద్
2సం॥, 16.7.2001
సుజాత-సుబ్రమణ్యం
కొట్నూరు-హిందూపురం

పి.నాగశారద
విశ్వజ్యోతి-విశ్వేశ్వర్
నల్లగొండ

బి.రాంబాబు
9సం॥, 17.7.1994
ఆదిలక్ష్మి-భాస్కరరావు
శాంతినగర్-ప॥గో॥

విహారి
6సం॥, 18.7.1997
వనజ-దీక్షితులు
పాము౽ూరు-ప్రకాశం

మనలో మాట

ఏం చేయనున్నాడో వానదేవుడు..

ఇది జులై నాలుగు ఉదయం రాస్తున్నాను!

మొన్నమొన్నటి వరకు ఎండకి అల్లాడిపోతూ బతికేం!

ఇప్పుడు వర్షాలు లేక తల్లడిల్లిపోతూ బతుకుతున్నాం!

మనం పిలిస్తే వరుణదేవుడు భూమ్మీద కాలు పెట్టడు! మనమీద వరుణదేవుడికి కనికరం లేకపోవచ్చు. తెలిసో తెలీకో కొన్ని చిన్న సైజు పాపాలు చేసి వుంటాం! కాబోలు! అంచేత వానా వానా వల్లప్పా అంటే వినపడలేదంటాడు! మన భాష అర్థం కాలేదంటాడు!

అంచేత వానదేవుడ్తో మన మొరవినిపించుకోవాలంటే కొందరు దైవజ్ఞులను ఆశ్రయించాలి! దైవజ్ఞులు గనక వానదేవుడు వాళ్ళకి అత్యంత ఆత్మీయుడని భావిస్తాం. వాళ్ళమాట వింటాడని ఆశపడతాం!

దైవజ్ఞులు కొందరు వానల కోసం జూన్ నెలలోనే పూజలు చేసేరు! ఈ విషయం పేపర్లలో చదివేం. వాల్‌పోస్టర్లలో చూసేం!

ఆ పూజల దెబ్బతో వానదేవుడు వణికి ఛస్తాడనుకున్నాం. రెండు మూడు రోజుల్లో – జూన్ నెలలోనే – గట్టిగా వానలు కురుస్తాయని గట్టిగానే నమ్మేం! కానీ, వారాలు గడిచినా వానదేవుడు దార్లోకి రాలేదు!

నువ్వెంతా నీ పూజలెంతా అని దైవజ్ఞ శిఖామణులతో బేరాలు ఆడుతున్నాడు కాబోలు! లేదా, నీ పూజలకీ, నీ యాగాలకీ నేను పడిపోను అని హెచ్చరిస్తున్నాడు! కాబోలు!

మనం సీదా సాదా మనుషులం గనక – వానదేవుడు మన మాటని పెడచెవిని పెట్టే ఛాన్సు చాలా ఉంది! తప్పులేదు. దైవజ్ఞులతో పెట్టుకుంటే వానదేవుడు ఏమైపోతాడోనని దిగులుగా వుంది!

దైవజ్ఞులు రాజకీయాల్లో తల దూర్చే వ్యక్తులు కానేకాదని మనం నమ్ముతుంటాం. అంచేత వాళ్ళు చెప్పిన మాటకి తిరుగుండదని భావిస్తాం. వాళ్ళల్లో కొందరు అవధానాల్లో అందెవేసిన చెయ్యి గలవారు. ఆశువుగా కవిత్వం చెప్పగల దిట్టలు. కోపమొస్తే కవిత్వంతో దేవుడ్ని సైతం శపించగల కవులు!

అంతే తప్ప–

క్షుద్ర రాజకీయాలతో వాళ్ళకేం సంబంధముంటుంది?

మన క్షేమం కోసం వానదేవుడ్ని కోప్పడి భూమ్మీదికి తెస్తామన్న పుణ్యమూర్తులు! ఇది రాజకీయ లక్షణమెందుకవుతుంది?

అంచేత–

వీళ్ళు రాజకీయాలకి దూరంగా ఎంతో పవిత్రంగా వుంటారు. వీళ్ళమాటని కూడా వానదేవుడు వినిపించుకోవడం లేదంటే కారణం ఏమిటి? వాళ్ళ పేపరు ప్రకటనలు – గోడమీద వాల్‌పోస్టర్లను తీసిపారేస్తుంటే – మన గతేంగాను? ఎవర్ని ఆశ్రయించాలి!

మంత్రాలకు చింతకాయలు రాలవని గడుగ్గాయిలు చెప్పేమాట నిజమైపోతుందా?

మనకి అనేకమంది స్వాములున్నారు! పర్వదినాల్లో వాళ్ళ పాదాలు కడిగి మన పాపాలను ప్రక్షాళన చేసుకుంటున్నాం. ఇంత హైరానా పడిపోతున్న మనల్ని ఆదుకునేందుకు స్వాములు ఎందుకు సంశయిస్తున్నారు?

ఆ స్వాములు గనక ఆకాశం వేపు కళ్ళెర్ర చేసి చూస్తే వానదేవుడు తట్టుకో గలడా? వణికి పోతూ వర్షం కురిపించాలి గదా?

బహుశా –

ఈ కార్యక్రమం మీద స్వాములకు ఇంట్రెస్టు లేదేమో? మనం చేసిన పాపాలకు ఈ శిక్ష అనుభవించాలని సమస్తమైన స్వాములు ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారేమో?

ఆల్‌రైట్–

ఆర్కే నారాయణ్ 'ది గైడ్' కథలో మాదిరి – నేను – అనగా పరమ సాదాసీదా మనిషిని – వానదేవుడ్ని మనసారా కోప్పడుతున్నాను! ఈ అక్షరాలు అచ్చయ్యేలోగా వానలు కురిపించమని హెచ్చరిస్తున్నాను!

చూద్దాం!

అప్పటికీ వానలు కురవకపోతే – నాలుగైదు పార్టీల జెండాలు సిద్ధం చేసుకుని – రాజకీయాల్లోకి వెళ్ళిపోతాను!

నన్నేం చేయనున్నాడో వానదేవుడు!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్‌స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
టూరిస్టుగైడ్	. . . 16
క్రీడారంగం	. . . 17
కళాసాహితి	. . . 21
పలుకుబడి	24
వగైరా	

ఇంకా...

ఆహారం విలువ తెలపాలి

బాలవికాసం . . . 10

ఆదుకో తల్లీ

'ఇంతి' సంగతులు . . . 15

సిండికేట్

కథ . . . 18, 19

గబ్బిలం

రియల్ స్టోరీ . . . 22, 23



కార్టూన్ కదంబం


అసలు రైతు జన్మభూమని పేరెందుకు పెట్టానంటే..!!
రైతులందరిని.. ఒక చోటకు పిలిచి.. లాఠీలతో.. చితక్కొడదామనా..సార్!!


మేధో మథనం
కుమ్ములాటలు ముఠాతగాదాలు
పదవుల కోసం



భారత్ టెన్నిస్ ముద్దుబిడ్డ సానియా

హైదరాబాద్ ముద్దుబిడ్డ సానియా మీర్జా వింబుల్డన్‌లో బాలికల డబుల్స్ టైటిల్ కైవసం చేసుకొని దేశంతో పాటు రాష్ట్రం పులకించింది. ఆరేళ్ల వయస్సులో టెన్నిస్ రాకెట్ చేతపట్టిన సానియా వయస్సుకు మించిన పరిణితిని కనబరుస్తూ అద్భుత విజయాలు సొంతం చేసుకుంటోంది. గ్రాండ్‌శ్లామ్ టైటిల్ హస్తగతం చేసుకున్న తొలి భారత మహిళగా ఆమె కొత్త చరిత్ర సృష్టించింది. తండ్రి ప్రోత్సాహంతో టెన్నిస్ పట్ల ఆసక్తి పెంచుకున్న సానియా అంచెలంచెలుగా ఎదిగి భారత్ గర్వించదగిన క్రీడాకారిణిగా అవతరించింది. చిన్నవయస్సులోనే అద్వితీయ విజయాలు సాధిస్తూ భారత టెన్నిస్‌కు బంగారు భవిష్యత్తు ఉందని నిరూపించింది. ముస్లిం కుటుంబంలో జన్మించిన ఈ పదిహేడేళ్ల అమ్మాయి సాంప్రదాయాలకు ఎదిరీది ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. బాలుర విభాగంలో గతంలో రమేశ్ కృష్ణన్, లియాండర్ పేస్ వింబుల్డన్ టైటిళ్లను సాధించారు. కానీ బాలికల, మహిళల విభాగాల్లో మాత్రం సానియాదే తొలి టైటిల్.

సానియా బయోడేటా	
పుట్టిన తేదీ	: 15 నవంబర్, 1986
జన్మస్థలం	: ముంబయి
ప్రస్తుత నివాసం	: హైదరాబాద్‌లోని బంజారా హిల్స్, రోడ్ నెంబర్-12.
ఎత్తు	: 1.68 మీటర్లు.
బరువు	: 54 కిలోలు.
ఆటతీరు	: కుడిచేతి ఆట (రెండు చేతులతో బ్యాక్‌గ్రౌండ్)
కోచ్‌లు	: నరేంద్రనాథ్, సిజికె భూపతి.
ఫేవరెట్ క్రీడాకారిణి	: స్టెఫీగ్రాఫ్
ప్రస్తుత సింగిల్స్ ర్యాంకు	: 9
ప్రస్తుత డబుల్స్ ర్యాంకు	: 1 (వింబుల్డన్ టైటిల్ సాధించడానికి ముందు 9వ ర్యాంకు)

సానియా మీర్జా ఈ స్థాయికి చేరుకోవడం వెనుక నిరంతర శ్రమ దాగి ఉంది. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలనే ఏకైక తలంపు కారణంగా ఆమె చదువు సరిగా సాగలేదు. ప్రాక్టీసు, టోర్నమెంట్ల కారణంగా ఆమె పరీక్షలకు హాజరుకాలేకపోయింది. అయితే ఆమె విద్యనభ్యసించే నాసర్ స్కూల్ యాజమాన్యం ప్రత్యేక క్లాసులు, పరీక్షలు నిర్వహించింది." దీంతో ఆమె చదువు నిరాటంకంగా కొనసాగగలిగింది. సానియా తండ్రి ఇమ్రాన్ మీర్జా క్లబ్ స్థాయి టెన్నిస్ ఆటగాడు. అతనికి క్రికెట్‌లో కూడా ప్రవేశం ఉంది. తన గారాల పట్టి సానియాను ఎలాగైనా గొప్ప టెన్నిస్ క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలని అతను కలలు కనేవాడు. కలలతోనే సరిపెట్టుకోకుండా టెన్నిస్‌లో ఓనమాలు నేర్పడంతో పాటు ఉత్తమ శిక్షణ ఇప్పించాడు. తండ్రి ఆశలకు తగ్గట్టుగా సానియా కూడా చిన్నప్పటినుండే టెన్నిస్‌లో అద్వితీయ ప్రతిభ కనబర్చసాగింది. తనకంటే పెద్ద వారిని సైతం ఆమె సునాయాసంగా ఓడించి తనకు బంగారు భవిష్యత్తు



ఉందని నిరూపించింది. అయితే ఆర్థిక ఇబ్బందులు ఇమ్రాన్‌ను వేధించసాగాయి. టెన్నిస్ ఖరీదైన క్రీడ కావడంతో ఖర్చు రోజురోజుకూ పెరగడం ప్రారంభించింది. ఇమ్రాన్ కన్‌స్ట్రక్షన్ బిల్డర్ అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా స్పాన్సర్ షిప్ కోసం వెతకడం ప్రారంభించాడు. ఈ దశలో జివికే గ్రూప్ అధినేత, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు జి.వి.కృష్ణారెడ్డి దృష్టి సానియాపై పడింది. ఆయన అందించిన ఆర్థిక సహాయంతో ఆమె అంచెలంచెలుగా ఎదిగింది. పలు జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లను గెల్చుకున్న ఆమె ఇప్పటివరకు జూనియర్ స్థాయిలో పది సింగిల్స్, 13 డబుల్స్ టైటిళ్లను హస్తగతం చేసుకుంది. అందులో భారత్‌తో పాటు పాకిస్తాన్, ఆఫ్రికా దేశాల్లో సాధించినవి ఉన్నాయి. దాంతోపాటు సీనియర్ స్థాయిలో కూడా ఐదు ఐటిఎఫ్ టైటిళ్లను (సింగిల్స్‌లో మూడు, డబుల్స్‌లో రెండు) కైవసం చేసుకోవడం ఆమె అసమాన ప్రతిభకు నిదర్శనం.

గ్రాండ్‌శ్లామ్‌లో క్రమంగా అభివృద్ధి

సానియా రెండేళ్ల క్రితం ఫ్రెంచ్ ఓపెన్ టోర్నమెంట్‌తో తొలిసారి గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నది. ఈ టోర్నీలో పాల్గొనడం కోసం ఆమె క్వాలిఫయింగ్ పోటీల్లో తన ప్రతిభను నిరూపించుకోవాల్సి వచ్చింది. అయితే ఈ టోర్నీలో ఆమె తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. కానీ వింబుల్డన్ ప్రారంభం నాటివరకు గ్రాండ్‌శ్లామ్ టోర్నీలో పాల్గొనడానికి అవసరమైన పాయింట్లు



సాధించింది. దీంతో ఆమె వింబుల్డన్‌లో నేరుగా పాల్గొనే అర్హత సాధించింది. ప్రతి టోర్నీలోనూ మెరుగైన ఆటతీరును ప్రదర్శిస్తూ ఈ సంవత్సరం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్ వరకూ దూసుకెళ్లింది. ఆ ఉత్సాహంతోనే తనకు ఫేవరెట్ మైదానం అయిన గ్రాస్‌కోర్టులో జరిగిన వింబుల్డన్‌లో పాల్గొని టైటిల్ హస్తగతం చేసుకుంది.

సింగిల్స్‌పై దృష్టి

అంతర్జాతీయ స్థాయిలో డబుల్స్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న సానియా సింగిల్స్‌లో అనుకున్నంతగా రాణించలేకపోతోంది. ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్‌లో తొలిరౌండ్‌లోనే ఓడిపోయిన ఆమె వింబుల్డన్‌లో రెండోరౌండ్‌లో కంగుతిన్నది. రష్యాకు చెందిన క్లైబనోవాతో కలిసి వింబుల్డన్ డబుల్స్ టైటిల్ హస్తగతం చేసుకున్నప్పటికీ తన ప్రధాన దృష్టి సింగిల్స్‌పైనే ఉంటుందని ఆమె ప్రకటించింది. పవర్‌గేమ్‌పై ఆధారపడే సెరీనా విలియమ్స్ బంతిని నిమిషానికి 107 కిలోమీటర్ల వేగంతో కొట్టగలుగుతుంది. సానియా 102 కిలోమీటర్ల వేగంతో కొడ్తూ సింగిల్స్‌లో తనకూ బంగారు భవిష్యత్తు ఉందని నిరూపించింది. బలమైన స్ట్రోక్‌లతో ప్రత్యర్థిని కంగుతినిపించే సత్తాగల సానియాకు సింగిల్స్‌లో రాణించే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆమె కోచ్ నరేంద్రనాథ్ అంటున్నాడు. వింబుల్డన్‌లో డబుల్స్ సాధించిన తాను త్వరలో ప్రారంభం కానున్న యు.ఎస్. ఓపెన్ గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్‌లో సింగిల్స్‌పై దృష్టి పెడ్తానని చెప్తోంది. అయితే సింగిల్స్ ఆటగాళ్లు కోర్టులో నలువైపులా తిరిగి బంతిని కొట్టాల్సి రావడంతో త్వరగా అలసిపోతారు. తన ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకుంటే సింగిల్స్ టైటిల్ సాధించడం కూడా ఆమెకు సునాయాసమవుతుంది. ఇప్పుడు మహేశ్ భూపతి నిర్వహిస్తున్న సిజికె శిక్షణా సంస్థలో ఆమె చేరింది. ఇక్కడ విదేశీ కోచ్‌ల సహాయంతో మరింత రాటుదేలుతానని ఆమె చెప్తోంది. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన డబ్ల్యు.టి.ఎ. ఇండియన్ మహిళల ఓపెన్ టోర్నమెంట్‌లో ఆమె డబుల్స్‌లో మేరీ పియర్స్ (అమెరికా)తో కలిసి పాల్గొన్నది. ప్రముఖ క్రీడాకారిణి పియర్స్‌తో కలిసి ఆడడం తనకు లభించిన గొప్ప గౌరవంగా సానియా అభివర్ణించింది. పియర్స్ నుండి చాలా పాఠాలు నేర్చుకున్నానని ఆమె తెలిపింది.

ఛాంపియన్లకు కొదువలేదు

రాష్ట్రంలో ప్రతిభగల క్రీడాకారులకు కొదువలేదు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలువురు రాష్ట్ర క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకున్నారు. కరణం మల్లేశ్వరి సిడ్నీ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడం ద్వారా రాష్ట్ర పేరు ప్రతిష్ఠలను నలువైపులా విస్తరింపజేసింది. సిడ్నీలో పతకం హస్తగతం చేసుకున్న ఏకైక భారత క్రీడాకారిణి మల్లేశ్వరి. అప్పుడు దేశమంతా ఆమెకు నీరాజనాలు పలికింది. తర్వాత పుల్లెల గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను సొంతం చేసుకొని మరొక రికార్డు నెలకొల్పాడు. ఈ టైటిల్ సాధించిన రెండో భారత ఆటగాడు గోపీచంద్ (మొదటి ఆటగాడు ప్రకాశ్ పదుకొనే). బ్యాడ్మింటన్‌లో అత్యున్నత టైటిల్ సాధించిన గోపీని కేంద్ర ప్రభుత్వం రాజీవ్ ఖేల్ రత్న అవార్డుతో సత్కరించింది. కోనేరు హంపి ప్రపంచ బాలికల జూనియర్ చెస్ టైటిల్‌ను, పెండ్యాల హరికృష్ణ ప్రపంచ బాలుర జూనియర్ చెస్ టైటిల్‌ను సొంతం చేసుకొని రాష్ట్రంలో ప్రతిభావంతులకు కొదువలేదని నిరూపించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

క్రీడాకారులు స్వయం కృషితో అంతర్జాతీయ టోర్నమెంట్లలో రాణించిన తర్వాత నజరానాలు ప్రకటించడం దేశంలో, రాష్ట్రంలో ఆనవాయితీగా మారింది. సానియాను కూడా ప్రారంభంలో పట్టించుకోని ప్రభుత్వం వింబుల్డన్ టైటిల్ సాధించగానే

వింబుల్డన్‌పై అంత క్రేజ్ ఎందుకు?

ప్రపంచ టెన్నిస్‌లో నాలుగు టోర్నమెంట్లు అత్యంత ప్రధానమైనవి. అవి వింబుల్డన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, యు.ఎస్. ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నమెంట్లు. ఈ నాలుగు టోర్నమెంట్లను కలిపి గ్రాండ్‌శ్లామ్ అంటారు. ఆటగాళ్లకు అత్యధిక పారితోషికం వింబుల్డన్ టోర్నమెంట్‌లోనే లభిస్తుంది. అందుకే ప్రపంచంలోనే టెన్నిస్ క్రీడాకారులంతా వింబుల్డన్‌లో ఆడేందుకు అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తారు. ఈ టోర్నీని 1877లో లండన్‌లోని ఆల్ ఇంగ్లండ్ క్రికెట్ అండ్ లాన్ టెన్నిస్ క్లబ్‌లో తొలిసారిగా నిర్వహించారు. తొలుత ఇది ఇంగ్లండ్ ఆటగాళ్లకే పరిమితమయ్యేది. 1900లో దీన్ని అంతర్జాతీయ టోర్నమెంట్‌గా మార్చారు. 1968 నుండి ఔత్సాహిక క్రీడాకారులతో ప్రొఫెషనల్స్ తలపడడం ప్రారంభమైంది. అప్పటినుండి దీన్ని వింబుల్డన్ 'ఓపెన్' టోర్నమెంట్‌గా పిలుస్తున్నారు.

జూనియర్ డబుల్స్ టైటిల్

14 నవంబర్, 1999 : పాకిస్తాన్ అంతర్జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-5)
2 అక్టోబర్, 2000 : పాకిస్తాన్ అంతర్జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-5)
20 జనవరి, 2001 : ఇండియన్ ఐటిఎఫ్ జూనియర్ టోర్నమెంట్-1 (గ్రేడ్-4)-న్యూఢిల్లీ
27 జనవరి, 2001 : ఇండియన్ ఐటిఎఫ్ జూనియర్ టోర్నమెంట్-2 (గ్రేడ్-4)-చండీఘర్
23 జులై, 2001 : మోవెన్‌పిక్ అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్ (గ్రేడ్-3)
30 జులై, 2001 : స్మాష్ టెన్నిస్ ఇంటర్నేషనల్ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-4)
4 జనవరి, 2002 : విక్టోరియన్ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-2)
17 జులై, 2002 : పిక్ ప్రిటోరియా జూనియర్ ఐటిఎఫ్ టోర్నమెంట్ (గ్రేడ్-2)
23 జులై, 2002 : ప్రిటోరియా యూనివర్సిటీ జూనియర్ ఐటిఎఫ్ టోర్నమెంట్ (గ్రేడ్-2)
5 ఆగస్టు, 2002 : ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ సౌత్/సెంట్రల్ ఆఫ్రికా సర్క్యూట్ (గ్రేడ్-3)-బోట్స్‌వానా
8 ఏప్రిల్, 2003 : షుజో ఛాలెంజ్ జపాన్ ఓపెన్ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-1)
10 ఏప్రిల్, 2003 : ఫ్రాంక్‌ఫర్డ్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-1)-జర్మనీ
6 జులై, 2003 : వింబుల్డన్ ఛాంపియన్‌షిప్-లండన్

జూనియర్ స్థాయిలో సింగిల్స్ టైటిల్లు

25 సెప్టెంబర్, 2000 : ఇండియన్ ఐటిఎఫ్ టోర్నమెంట్ (గ్రేడ్-4)-ముంబయి
2 అక్టోబర్, 2000 : పాకిస్తాన్ అంతర్జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-5)
27 జనవరి, 2001 : ఇండియన్ ఐటిఎఫ్ జూనియర్ టోర్నమెంట్-2 (గ్రేడ్-4)-చండీఘర్
5 ఫిబ్రవరి, 2001 : ఇండియన్ ఐటిఎఫ్ జూనియర్ సర్క్యూట్ టోర్నమెంట్-3 (గ్రేడ్-4)-కొల్‌కతా
16, ఫిబ్రవరి, 2001 : బంగ్లాదేశ్ అంతర్జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-3)
23 జులై, 2001 : మోవెన్‌పిక్ అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్ (గ్రేడ్-3)
23 జులై, 2002 : ప్రిటోరియా యూనివర్సిటీ జూనియర్ ఐటిఎఫ్ టోర్నమెంట్ (గ్రేడ్-2)
5 ఆగస్టు, 2002 : ఐటిఎఫ్ సౌత్/సెంట్రల్ ఆఫ్రికా సర్క్యూట్ (గ్రేడ్-3)-బోట్స్‌వానా
9 డిసెంబర్, 2002 : ఆసియా జూనియర్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ (గ్రేడ్-బి2)
1 ఏప్రిల్, 2003 : మిట్సుబిషి లాన్సర్ ఇంటర్నేషనల్ జూనియర్ ఛాంపియన్ షిప్ (గ్రేడ్-1)

రికార్డులు

బ్రిటన్‌కు చెందిన కవల సోదరులు ఎర్నెస్ట్ రెన్‌షా, విలియం రెన్‌షాలు 1881 నుండి 1889 వరకు విడివిడిగా సింగిల్స్ పోటీల్లోనూ, కలిసి డబుల్స్ పోటీల్లోనూ పాల్గొని మొత్తం 13 టైటిళ్లు సాధించారు. వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను అతిపిన్న వయస్సులో గెల్చుకున్న క్రీడాకారుడిగా జర్మనీకి చెందిన బోరిస్ బెకర్ (17 ఏళ్లలో) రికార్డు సాధించాడు. మహిళల విభాగంలో ఈ రికార్డు స్విట్జర్లాండ్‌కు చెందిన మార్టినా హింగిస్ (15 సంవత్సరాల 282 రోజులు) పేరున ఉంది. అమెరికాకు చెందిన పీట్ సంప్రాస్ వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా నాలుగు సార్లు, మొత్తం ఏడు సార్లు గెలుచుకొని విలియం షా రికార్డును సమం చేశాడు. ఈ పోటీలు ప్రతి సంవత్సరం జూన్-జులై మాసాల్లో జరుగుతాయి.

సీనియర్ టైటిళ్లు (డబ్ల్యుటిఎ టూర్)

సింగిల్స్

సెప్టెంబర్ 2002 : ఐటిఎఫ్ టోర్నమెంట్ (హైదరాబాద్)

నవంబర్ 2002 : ఐటిఎఫ్ టోర్నమెంట్ (మనీలా-ఫిలిప్పైన్స్)

ఫిబ్రవరి 2003 : ఐటిఎఫ్ టోర్నమెంట్ (లాగోస్-నైజీరియా)

డబుల్స్

నవంబర్ 2002 : ఐటిఎఫ్ టోర్నమెంట్ (లాగోస్-నైజీరియా)

నవంబర్ 2002 : ఐటిఎఫ్ టోర్నమెంట్ (మనీలా-ఫిలిప్పైన్స్).

ఆసియాడ్ టైటిల్ : బుసాన్ ఆసియాడ్‌లో లియాండర్ పేస్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్.

గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్లలో

2001

వింబుల్డన్ : సింగిల్స్, డబుల్స్‌లలో రెండోరౌండ్.

యు.ఎస్. ఓపెన్ : సింగిల్స్‌లో మొదటి రౌండ్, డబుల్స్‌లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్

2002

ఆస్ట్రేలియన్ ఓపెన్ : సింగిల్స్‌లో రెండోరౌండ్, డబుల్స్‌లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్

ఫ్రెంచ్ ఓపెన్ :-సింగిల్స్‌లో మొదటిరౌండ్, డబుల్స్‌లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్.

వింబుల్డన్ : సింగిల్స్‌లో మొదటి రౌండ్, డబుల్స్‌లో రెండోరౌండ్.

యు.ఎస్. ఓపెన్ : సింగిల్స్‌లో మొదటి రౌండ్, డబుల్స్‌లో ప్రీ క్వార్టర్ ఫైనల్స్.

2003

ఫ్రెంచ్ ఓపెన్ : సింగిల్స్‌లో మొదటి రౌండ్, డబుల్స్‌లో సెమీఫైనల్స్.

వింబుల్డన్ : సింగిల్స్‌లో రెండోరౌండ్, డబుల్స్ టైటిల్.

పది లక్షల రూపాయల నజరానా, ఇంటి ప్లాటు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ప్రకటించారు. ఆటగాళ్లు కఠోర దీక్షతో కృషి చేసి తమ ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శించిన తర్వాత హడావుడిగా నజరానాలు ప్రకటించే బదులు వారు రాణించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆసక్తి కనబర్చాలి. ప్రజల సంక్షేమ కార్యక్రమాల నుండే వైదొలుగుతున్న ప్రభుత్వం ఆటగాళ్ల సంక్షేమాన్ని పట్టించుకోవాలనుకోవడం అత్యాశే అవుతుంది.

రాష్ట్రంలో సానియా వంటి క్రీడాకారిణులు మరెంతోమంది ఉన్నారు. వారు వివిధ కారణాల రీత్యా ఆటలపట్ల తమ ఆసక్తిని మధ్యలోనే తుంచేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్థిక కారణాలు వారిని ముందుకు వెళ్లనివ్వడం లేదు. వారి ఆటకు పదును పెట్టేందుకు అవసరమైన శిక్షణా శిబిరాలను రాష్ట్రం నలువైపులా ఏర్పాటు చేయాలి. ప్రాంతీయ స్థాయిలో టోర్నమెంట్లను నిర్వహించి అందులో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇవ్వాలి. తద్వారా ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించగలుగుతాం. ప్రభుత్వ ఖర్చులతో వీరి ఆటకు మరింత పదును తెస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించ గలుగుతారు.

ఈ విషయంలో మన ప్రభుత్వాల పరిస్థితి 'చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు'గా మారింది. దీంతో ప్రతిభ గల క్రీడాకారులు ప్రైవేటు స్పాన్సర్‌షిప్‌పై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రైవేటు సంస్థలు ఆటగాడి ప్రతిభకు విలువ ఇవ్వడానికి బదులు తమ ఉత్పత్తుల విక్రయానికి దోహదపడే ఆటలకే ఆర్థికంగా సహాయం అందిస్తున్నాయి. దీంతో వేళ్లపై లెక్కించగలిగిన సంఖ్యలోనే ఆటగాళ్లు రాణింగలుగుతున్నారు. మరెంతో మంది క్రీడాకారులు ప్రతిభ ఉన్నప్పటికీ ప్రోత్సాహంలేక తెరమరుగవుతున్నారు. ప్రభుత్వం ప్రైవేటు సంస్థలపై ఆధారపడడం మాని సొంత ఖర్చుతో ఆటగాళ్లను అభివృద్ధి చేస్తే మరెంతోమంది సానియాలు తెరపైకి వస్తారు. ఈ విషయంలో చైనా, ఇండోనేషియాలను ఆదర్శంగా తీసుకోవాలి.

◆

ఎయిడ్స్ రాకుండా ఏం చేయాలి ?

ఎయిడ్స్ కౌన్సిలర్ కె.రమేష్‌తో ఇంటర్వ్యూ



ఒకప్పుడు 'క్యాన్సర్' అన్న పదం వింటే ప్రజలు భయభ్రాంతులకు గురై వణికి పోయేవారు. క్యాన్సర్ వ్యాధి వస్తే ఇక మృత్యుశయ్య మీద ఉన్నట్లుగానే భావించేవారు. అయితే ఆధునిక వైద్యవిధానాల పుణ్యమా అని క్యాన్సర్ వ్యాధి నిరోధానికి సంబంధించిన ఎన్నో మంచి మంచి చికిత్సా విధానాలు వెలుగు చూడడం వల్ల, ఈనాడు ప్రాథమిక దశల్లో క్యాన్సర్ వ్యాధిని గుర్తించే అవకాశం కలగడమే కాకుండా సాధారణ వ్యక్తికి సైతం కనీస వైద్య విజ్ఞాన సమాచారం అందుబాటులోకి రావడం వల్ల వ్యాధికి తగిన చికిత్సను సకాలంలో పొంది, అందరి మాదిరిగానే హాయిగా బతికే అవకాశం కలుగుతున్నది.

కానీ, ఈ రోజున క్యాన్సర్ వ్యాధిని మించిన వ్యాధి సమాజంలో చాపకింద నీరులా పట్నాలలోని వాడవాడలా వ్యాపించి గ్రామాలకు సైతం పాకిపోతున్నది. జాతీయ రహదారుల వెంబడి కుక్కగొడుగుల్లా వెలుస్తున్న ధాబాలుగా చెప్పబడే కొన్ని వ్యభిచార కేంద్రాలు, విత్తనాల ద్వారా బీజవ్యాప్తి మాదిరిగా మానవ సమాజాన్ని వ్యాధితో నింపేస్తున్నాయి. ఎయిడ్స్ అనబడే ఈ ప్రాణాంతక వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోతే, వ్యాధి వ్యాపించకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోకపోతే, ఈ ఎయిడ్స్ వ్యాధి వల్ల ప్రాణం పోయే వారి సంఖ్య ఎక్కువయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి.

ప్రతి విషయానికి ప్రభుత్వం మీద ఆధారపడి ఎదురు తెన్నులు చూచే మనం, మన పక్షాన సహకారం అందిస్తే తప్ప, ఈ ఎయిడ్స్ మహమ్మారిని మట్టుపెట్టలేము. అయితే ఎయిడ్స్ వ్యాధి సోకిన వారి విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలాంటి పరీక్ష-చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయో వరంగల్ జిల్లా జనగామ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో, ఎయిడ్స్ కౌన్సిలర్‌గా తన విశిష్ట సేవలందిస్తున్న కె.రమేష్ ద్వారా తెలుసుకుందాం.

● ఈనాడు ఎవరినోట విన్నా, వార్తాపత్రికలు చదివినా, రేడియో విన్నా, టీవీ చూసినా హెచ్.ఐ.వి., ఎయిడ్స్ వ్యాధిని గురించి ప్రముఖంగా వినిపిస్తున్నది. అసలు ఈ హెచ్.ఐ.వి.-ఎయిడ్స్ అంటే ఏమిటి ?

హెచ్.ఐ.వి. అనేది ఆంగ్లపదం. దానినే 'హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్' అంటారు. అంటే మనిషి శరీరంలోని రక్షణ వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విష క్రిమి అని అర్థం. హెచ్.ఐ.వి. మానవ జీవ కణాలకు సోకి, వాటిని తన ప్రతిరూపాల సృష్టికి వాడుకుంటుంది. ఈ వైరస్ ఎయిడ్స్ వ్యాధిని కలిగిస్తుంది.

ఎయిడ్స్ అంటే 'ఎక్వయిర్డ్ ఇమ్యునో డెఫిషియన్సీ సిండ్రోమ్'కు సంక్షిప్త రూపం. దీనినే 'సంప్రాప్త వ్యాధి నిరోధక శక్తి రాహిత్య స్థితి' అంటారు. హెచ్.ఐ.వి. ఒక వ్యక్తిలోని రోగ నిరోధక రక్షణ వ్యవస్థను నాశనం చేశాక, ఆ వ్యక్తి శరీరం అనేక వ్యాధులకు నిలయంగా మారుతుంది. అదిగో, ఆ దశను 'ఎయిడ్స్' అంటారు.

● మరి, ఎయిడ్స్ వ్యాధి రావడానికి కారణాలేమిటి? ఈ వ్యాధి వచ్చినట్లు ఎలా తెలుస్తుంది ?

ఎయిడ్స్ రావడం అంటే, అప్పటికే మన శరీరంలోకి హెచ్.ఐ.వి. ప్రవేశించి ఉండడం అన్నమాట! అయితే ఇక్కడ హెచ్.ఐ.వి. రావడానికి గల కారణాలను తెలుసుకోవాలి. అది ఏమిటంటే హెచ్.ఐ.వి. ఉన్న వ్యక్తితో లైంగిక కార్యక్రమంలో పాల్గొనడం, సురక్షితమైన 'డిస్పోజబుల్ సిరంజి'లు వాడకపోవడం, వివిధ పరీక్షలకు నోచుకోని రక్తాన్ని శరీరంలోకి ఎక్కించడం, హెచ్.ఐ.వి. వున్నట్లు తెలిసినా స్త్రీ గర్భం ధరించి బిడ్డను ప్రసవించడం వంటివి కొన్ని ప్రధాన కారణాలు.

అయితే, హెచ్.ఐ.వి. సోకినట్లుగా మనకు కన్పించే కొన్ని లక్షణాల ద్వారా పసిగట్టవచ్చు. అవి ఏమిటంటే ఉన్నట్లుండి బరువు తగ్గిపోవడం, ఎన్ని మందులు వాడినా దగ్గు, జ్వరం, ఆయాసం వంటి సాధారణ సమస్యలు తగ్గకపోవడం, ఫంగస్ వ్యాధులు చర్మం మీద విస్తరించడం, బుద్ధి మందగించడం, మతిమరుపు, తలనొప్పి, మూర్ఛ, మింగలేకపోవడం, మాట్లాడలేకపోవడం, ఎంతకూ తగ్గని విరేచనాలు, శరీంలోని లింపు గ్రంథులు వాయడం, కళ్ళల్లో ఉన్ని మచ్చలు రావడం వంటి లక్షణాల ద్వారా హెచ్.ఐ.వి. సోకినట్లుగా అనుమానించవచ్చు.

● ఎయిడ్స్ వ్యాధి ఏ ఏ వర్గాలలో అధికంగా ప్రబలి ఉంది. మొత్తం నమోదవుతున్న కేసుల్లో స్త్రీ, పురుష, బాలల నిష్పత్తులు ఏ విధంగా ఉన్నాయి ?

అక్షరజ్ఞానం లేని అట్టడుగు బీద ప్రజలలో హెచ్.ఐ.వి. సోకిన వారు అధికంగా ఉంటున్నారు. వీరికి, హెచ్.ఐ.వి. గురించి, ఎయిడ్స్ గురించి, సురక్షిత లైంగ్గిక పద్ధతులు తెలియకపోవడం ముఖ్య

కారణాలుగా తెలుస్తున్నది.

ధనిక వర్గాలలోను, మధ్యతరగతి ప్రజలలోను, హెచ్.ఐ.వి. కొద్దిగా తక్కువ స్థాయిలోనే ఉందని చెప్పాలి. ఏ వర్గానికి చెందిన వారైనా ఒక్కరి కంటే ఎక్కువ మందిలో సెక్స్‌లో పాల్గొన్న వారిలో ఈ వ్యాధి పొడసూపుతున్నది. మా దగ్గర నమోదవుతున్న కేసుల్లో స్త్రీలు 47 శాతం, పురుషులు 48 శాతం, బాలలు 5 శాతం ఉంటున్నారు.

● ఎయిడ్స్‌ను వ్యాధి అని కొందరు, కాదని మరికొందరు అంటుంటారు. సాంకేతికపరమైన ధృవీకరణలతో మీరేమంటారు ?

ఏ కోణం నుంచి చూచినా ఎయిడ్స్ వ్యాధి, అంటు వ్యాధి అని చెప్పక తప్పదు. 1981వ సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా హెచ్.ఐ.వి. సోకిన వారు సుమారు లక్ష మంది ఉన్నట్లుగా అంచనా. ఈనాడు నాలుగు కోట్లకు ఇది చేరిందంటే ఆశ్చర్యపడక తప్పదు. అంటే సుమారుగా నాలుగు వందల రెట్లు పెరిగిందన్నమాట! ప్రపంచ మంతటా శరవేగంతో ఇది వ్యాపిస్తుండడాన్ని గమనిస్తే ఇది అంటు వ్యాధి గాక మరేమవుతుంది.!

● ఎయిడ్స్ వ్యాధికి గురైన స్త్రీ, పురుషులు (ప్రధానంగా భార్యాభర్తలు) సంసార సుఖాలకు స్వస్తి పలకవలసిందేనా? లేకుంటే ఏమైనా ప్రత్యామ్నాయ మార్గాలున్నాయా?

భార్యా భర్తలలో ఏ ఒక్కరికి హెచ్.ఐ.వి. వున్నా ఆ.. వ్యక్తి ఇతర వ్యక్తులతో (స్త్రీగాని, పురుషుడుగాని) సెక్స్‌లో పాల్గొన్నా అదే విధంగా ఈ హెచ్.ఐ.వి. లేని వ్యక్తి అపరిచిత వ్యక్తులతో సెక్స్‌లో పాల్గొన్నా, కండోమ్ (నిరోధ్) తప్పక వాడాలి. ఎందుచేతనంటే, హెచ్.ఐ.వి. ఒకరి నుండి ఒకరికి సంభోగం ద్వారా సంక్రమిస్తుంది కనుక!

ముఖ్యంగా మగవారు సెక్స్‌లో పాల్గొనకుండా హస్తప్రయోగం వంటి ఇతర చర్యల ద్వారా సంతృప్తి పడడం ఉత్తమం. ఎందుచేతనంటే, నిరోధ్ కూడా ఎనభైశాతం మాత్రమే రక్షణ నీయగలదు. నిరోధ్ వాడిన వారిలో సైతం హెచ్.ఐ.వి. సోకిన ఉదంతాలు వున్నాయి.

● ఎయిడ్స్ బాధితురాలు గర్భం ధరించినట్లు ధృవీకరింప బడినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

హెచ్.ఐ.వి. వున్న స్త్రీకి గర్భం వున్నట్లు తెలినట్లయితే ఆ గర్భం మూడు నెలల వయస్సుదయితే గర్భస్రావం చేయించుకోవడమే ఉత్తమ మార్గం. గర్భం మూడు నెలలు దాటినట్లయితే, ఆ స్త్రీ సుఖ ప్రసవం కావడానికి, తల్లి నుండి బిడ్డకు హెచ్.ఐ.వి. సోకకుండా ఉండడానికి పి.పి.టి.సి. కేంద్రాల సదుపాయం ఉన్న ఆసుపత్రులకు తరలించాలి. ఈ కేంద్రాలు తల్లి నుండి బిడ్డకు హెచ్.ఐ.వి. సోకకుండా నిరోధించే వైద్య సదుపాయాలను కలిగి ఉంటాయి.

● ప్రభుత్వపరంగా, ప్రసూతి వైద్యశాలల్లో, శస్త్రచికిత్స ప్రధానమైన ఆసుపత్రులలో ఎయిడ్స్‌వ్యాధి సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులలో 'డిస్పోజబుల్ సిరెంజిలు' వాడడాన్ని ప్రోత్సహించాలి. అలాగే 'డిస్పోజబుల్ ఆపరేషన్ కిట్స్' వాడాలి. స్టెరిలైజేషన్ విషయంలో అప్రమత్తగా ఉండాలి.

● లైంగిక సంబంధమైన వ్యాధులు 'ఎయిడ్స్ వ్యాధి'గా రూపాంతరం చెందే అవకాశం ఉందా? ఉంటే తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి ?

గనేరియా, క్లమీడియా, సిఫిలిస్, షాంక్రాయిడ్స్, హెర్పీస్, ట్రైకోమోనియాసిస్, క్యాండిడియాసిస్, క్యాండిలోమా, లింఫోగ్రాన్యులో మావెనీరియం అనేవి లైంగిక సంబంధమైన సుఖ వ్యాధులు. లైంగిక వ్యాధులు సోకిన వారి జననాంగాలపై రకరకాల పుండ్లు, అల్సర్లు ఉండడం సహజం! ఈ వ్యాధులు కలిగి ఉన్న వారికి హెచ్.ఐ.వి. సోకే అవకాశం పది రెట్లు ఎక్కువ. ఈ వ్యాధులు ఉన్న వారు ఇతరులతో సంభోగ సంబంధం ఏర్పరచుకోకూడదు. పూర్తిగా తగ్గే వరకు కండోమ్ లేకుండా సెక్స్‌లో పాల్గొనకూడదు.

● ఎయిడ్స్‌వ్యాధి ఉన్న వ్యక్తి జీవితకాలం ఎంతకాలం ఉంటుంది? దీన్ని మరింతగా పెంచే మార్గాలున్నాయా?

హెచ్.ఐ.వి. సోకినట్లు తెలియగానే జీవితం ముగిసినట్లుగా భావించకూడదు. అయితే, ఎయిడ్స్ వ్యాధి వున్న వ్యక్తి కొద్ది నెలలలోనే చనిపోయే అవకాశం ఉంది. హెచ్.ఐ.వి. సోకిన వ్యక్తి, ఎయిడ్స్ వ్యాధి దశకు రాకుండా ఉండడానికి ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటే మంచిది. దీనికితోడు ధ్యానం, యోగాసనాలు, వ్యాయామం చేస్తూ యాంటీ రెట్రోవైరల్ మందులు వాడుకోవాలి. సారా వంటి మత్తు పదార్థాలకు స్వస్తి పలికి, ఆరోగ్య నియమాలు పాటిస్తూ, మానసికంగా, ప్రశాంతంగా ఉన్నట్లయితే చాలాకాలం బతికి బట్టకట్టే అవకాశం ఉంది.

● ఎయిడ్స్ నిరోధంలో 'నిరోధ్' పాత్ర ఎంతవరకు ఉంది? పరాయిస్త్రీలతో సంయోగం మానమనడం సరైనదా? లేక నిరోధ్ వాడమనడం సరైన విధానమా?

హెచ్.ఐ.వి. ఉన్న వారితో నిరోధ్ వాడుతూ సెక్స్‌లో పాల్గొనప్పటికీ వ్యాధి సోకదనే గ్యారంటీ లేదు. నిరోధ్ నూటికి నూరుశాతం భద్రతనీయజాలదు. భార్యతో తప్ప, పరాయి స్త్రీలతో లైంగిక సంబంధాలు మానుకోవడమే మేలు! తప్పనిసరి, అత్యవసర పరిస్థితులలో మాత్రమే నిరోధ్ వాడాలి తప్ప, నిరోధ్ వాడుతూ అక్రమ సంబంధాలు కొనసాగించాలని చెప్పడం ప్రభుత్వ ఉద్దేశం కాదు.

● ఎయిడ్స్-పరీక్షలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో చెప్తారా?

మన రాష్ట్రంలో ప్రతి బోధనా ఆసుపత్రిలోను, జిల్లా కేంద్ర ఆసుపత్రులలోను, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌కు సంబంధించిన అన్ని ఏరియా ఆసుపత్రులలోను ఈ పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిని 'వి.సి.టి.సి.' (వాలంటరీ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్) సెంటర్స్' అంటారు. ఈ కేంద్రాలను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి వారు ఏర్పాటు చేశారు.

ఈ సెంటర్లకు వచ్చే వ్యక్తులకు, 'ఎయిడ్స్/హెచ్.ఐ.వి.'ల గురించి తెలియజేసి (కౌన్సిలింగ్) హెచ్.ఐ.వి. పరీక్షకు నామమాత్రంగా కేవలం పది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇక్కడ కచ్చితమైన పరీక్షలు జరపబడతాయి.

ఒకవేళ పరీక్షలో హెచ్.ఐ.వి. వున్నట్లు నిర్ధారణ అయితే, ఆత్మస్థైర్యంతో కుటుంబంలో, సమాజంలో ఏ విధంగా జీవించాలో 'ఎయిడ్స్ కౌన్సిలర్లు' తెలియజేస్తారు.

● అన్నింటికంటే ముఖ్యమైన విషయం కొత్తగా పెళ్ళి చేసుకొనబోయే వారు, హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవడం ఎంతవరకు సబబు? దానిమీద మీ అభిప్రాయం ఏమిటి ?

కొత్తగా పెళ్ళి చేసుకోబోయే ప్రతి అబ్బాయి, అమ్మాయి తప్పనిసరిగా హెచ్.ఐ.వి. పరీక్షలు చేయించుకోవడం మంచిది. ఎందుచేతనంటే హెచ్.ఐ.వి. అనేది అక్రమ సంబంధాల వల్ల మాత్రమే కాకుండా సిరంజిల వల్ల కూడా వచ్చే ప్రమాదముంది.

ప్రస్తుత సమాజంలో హెచ్.ఐ.వి.వున్న పదిమందిలో తొమ్మిది మందికి వారిలో హెచ్.ఐ.వి. ఉన్నట్లు తెలియదు.

చాలా మంది యువకులు హెచ్.ఐ.వి. కలిగి ఉండి, పెళ్ళిళ్ళు చేసుకొని జీవిత భాగస్వామికి, పుట్టబోయే బిడ్డలకు సైతం హెచ్.ఐ.వి. సంక్రమింప చేస్తున్నారు. అందుకే యువతీ యువకులు, హెచ్.ఐ.వి. పరీక్ష చేయించుకొన్న తరువాత, ఇరుపక్షాలు ఆ రిపోర్టులు చూసి సంతృప్తి పడ్డాకనే పెళ్ళి చేసుకొన్నట్లయితే జీవిత భాగస్వామికి, బిడ్డలకు, ఆరోగ్యాన్ని, నిత్య సంతోషాన్ని పంచిన వారవుతారు.

ఇంటర్వ్యూ : డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

ఆదివారం అనుబంధంలో పాఠకుల నుంచి ఆరోగ్య సమస్యలపై ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. మీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరిష్కారాలు సూచిస్తారు. ప్రశ్నలు సూటిగా, సాధ్యమైనంత కుప్లంగా ఉండాలి.

ప్రశ్నలు పంపవలసిన చిరునామా :

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

✻ ముదిగంటి సుజాతారెడ్డి

దుప్పటే చాలనప్పుడు?....

మా దూరపు చుట్టం విజ్జీ నన్ను చూసిపోదామని మా ఇంటికి వచ్చింది. "నువ్వు బాగున్నావా?... నేను బాగున్నాను"... వంటి మాటలు అయిపోయాక నేను విజ్జీని అడిగాను.

"మీ అక్క రమ ఎట్లా వుందే?"

"రమా?... నీకు రమ ఎందుకు యాదికొచ్చిందే!... హాఁ .. రమ ఏం బాగా లేదు. చాలా టెన్షన్‌లో వుంది."

"టెన్షనా! టెన్షనెందుకు?... సంతోషంగా వుండాలి. రమ ఆదర్శాలకనుగుణంగా కట్నమేమీ తీసుకోని అల్లుడు దొరికాడు" సందేహంగా చూశాన్నేను విజ్జివైపు.

కూతురుకైతే కట్నం కోరని భర్త దొరికాడు. కాని రమక్కకు ఇప్పుడున్న చింతంతా కొడుకు పెళ్ళి గురించి."

"కొడుకు పెళ్ళి గురించి చింతా? ఎందుకు?"

"ఎందుకేమిటి. కొడుక్కు బాగా వున్న వాళ్ళమ్మాయి కావాలి. కూతురుకు కట్నం ఇయ్యనని ఆదర్శాన్ని చాటుకొని పెళ్ళి చేసింది. అందుకని కొడుక్కు కట్నం ఇంత కావాలని అడిగే పరిస్థితిలో లేదు. కాబట్టి బాగా వున్న వాళ్ళు, ఒక్కతే కూతురున్న సంబంధం కోసం వేట మొదలు పెట్టింది. కట్నం ఏమొద్దు గాని పెళ్ళి ఘనంగా చేసి లాంఛనాలు బాగా జరిపే సదాచారాలు గల సంబంధం కావాలని అంటున్నది. ఇంకోవైపు ఇంజనీరో, కంప్యూటరో చదివిన అమ్మాయి కావాలి. అమెరికా పోతే గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చొని బోరుగా వుందని మెదడు కాల్చుకొని తినేఅమ్మాయి కాకుండా వుండాలి. ఉద్యోగం చేసేది కావాలని కొడుకంటున్నాడంటుంది" విజ్జి మాటలు పూర్తి చేయకముందే నేనందుకున్నాను.

"వాహ్‌వా! బాగుందే!... చదువుకున్న అమ్మాయి ఉద్యోగం చేసి సంపాదించే అమ్మాయి కావాలి. పైగా లాంఛనాలు బోలెడు తెచ్చే అమ్మాయి, ముందు ముందు కావల్సినంత ఆస్తిని అందుకునే అమ్మాయి కావాలన్నమాట! ఇక కట్నం వద్దనే పేరేగాని అన్ని విధాల డబ్బు కురిపించే అమ్మాయినే కోరుకుంటున్నది మీ అక్క!...." విజ్జి వైపు చూసి మళ్ళా మొదలు పెట్టాను. "అయినా రమకు ఒక్క కూతురు, ఒక్క కొడుకు. కూతురు పెళ్ళయిపోయింది. కొడుకు విదేశాలకు వెళ్ళాలనుకుంటున్నాడు. మరేం తక్కువని రమకు..."

"అదేనే! కొందరికి ఎట్లా వుంటుందంటె కూతురుకు కట్నం ఇయ్యొద్దని ఆదర్శాలు వల్లిస్తారు... అదే రెండు వైపులా కూతురుకు కట్నం ఇయ్యను కొడుక్కు తీసుకోను!... అని వుండాలి. అప్పుడు గాని ఈ వరకట్న నిర్మూలన అనేది జరగదు!" అంది విజ్జీ. నిజమేనే. అది పోంగా కట్నం తీసుకోమని పెళ్ళి చేసుకుంటారు. పెళ్ళి అయ్యాక మా వాడికి అంత ఇచ్చేవాళ్ళు వచ్చారు, ఇంత ఇచ్చే వాళ్ళు వచ్చారు అని విచారం, దుఃఖం, పశ్చాత్తాపాలతో సూటిపోటి మాటలు మొదలు పెట్టారు.

పెద్దవాళ్ళు. ఆర్థికంగా నిలబడలేని భర్త అదే పని చేస్తాడు. అందుకే గద! తెల్లవారి పేపరు తీయగానే రెండోమూడో వరకట్నం చావులు చూస్తున్నాం! అందుకే యువతీయువకుల్లో కట్నం తీసుకోం అనే దృఢ నిశ్చయం వుండాలి. అప్పుడే ఏమన్న పని చేస్తుంది. మొన్న మొన్ననే చూడు రెండు వార్తలు విన్నాం- ఢిల్లీలో నిషా శర్మ అనీ, చెన్నైలో విద్య అనే అమ్మాయిలు తీర పెళ్ళి అయ్యే సమయానికి ఇంకా ఇంకా వరకట్నం కావాలని అడిగే పెళ్ళి కొడుకుల దురాశను భరించలేక పోలీసులనాశ్రయించారు. వాళ్ళ ధైర్య సాహసాలు మెచ్చుకోవాలె విజ్జీ! పోలీసులనాశ్రయిస్తే పరువు పోతుందని గాని, మళ్ళా పెళ్ళి అవుతుందో లేదో అని గాని భయపడకుండా వెనకాముందాడకుండా ముందుకు వచ్చారు. అట్లా ఆడపిల్లల్లో జంకూగొంకూ పోతేనేగాని ఈ సమస్య కొంతవరకు పరిష్కారం కాదు" అన్నాన్నేను.

"ఇంకొకటుందే! తల్లిదండ్రులు సంపాదించిందంతా కొడుకులకే చెందాలనే ఆలోచన కూడా మనలో తరతరాల నుంచి వదలడం లేదు. సరే! చెప్పుకోవడానికి చట్టాలున్నాయి. నిషేధిస్తున్నాయి. శిక్షిస్తామంటున్నాయి! కూతురుకు తలదండ్రుల ఆస్తిలో భాగస్వామ్యముండాలని చట్టం వుంది. వరకట్నాన్ని నిషేధిస్తూ చట్టం వుంది. అట్లా ఎన్ని చట్టాలున్నా ఈ వరకట్నం బాధలు మాత్రం పోవడం లేదు!" విజ్జి కొంచెం ఆవేశంగానే అన్నదా మాటలు.

"శాంతించు శాంతించు విజ్జీ! ఆవేశంతో అయ్యే పనిగాదు ఇది. దీనివెనుక ఎన్నో సామాజిక ఆర్థిక కారణాలున్నాయి. నిరుద్యోగం పోయి స్వావలంబనం పెరిగితేనే గాని యువతీ యువకుల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం రావు. వాటితోనే పరాయి ధనానికి ఆశపడే తత్వం పోతుంది. ఇతరుల సంపాదన మీద కాక తన జీవిత నిర్మాణం తాను చేసుకోవాలనే తపన పెరుగుతుంది. ఇవన్నీ వస్తేనే గాని ఈ వరకట్న నిర్మూలనం అనేది జరగదు!" అన్నాన్నేను. "ప్చ్! నిజమే నీవన్నది. పెద్దవాళ్ళల్లో... అంటె చూడు!... మా రమక్కలో లాగా ద్వంద్వనీతి వుండకూడదు. వరకట్నం నశించాలి అని నినాదాలిచ్చిన వాళ్ళే కొడుకుల సంగతి వచ్చేసరికి ఆశను వదులుకోలేకుండా వున్నారు" అంది విజ్జీ. "ఇప్పుడు ఆడపిల్లలను కడుపులో వుండగానే చంపేస్తున్నారు. ఆడపిల్లల్ని కనే ఇష్టం లేక భ్రూణ హత్యలు జరుగుతున్నాయి. దాంతో ఆడపిల్లల సంఖ్య మగవాళ్ళతో పోలిస్తే తగ్గిపోతున్నదని అంటున్నారు గద! అయితే అట్లా ఆడపిల్లల జనాభా ఇంకా తగ్గితే పెళ్ళిక్కావల్సిన ఆడపిల్లలు దొరకనప్పుడేమైన ఈ వరకట్నం అంతరిస్తుందేమోనే!" అన్నాన్నేను.

"కాని అప్పుడు కన్యాశుల్కం మొదలవుతుందేమో చూడు!" అంది విజ్జీ.

"సరిపోయింది ఎటులాగినా దుప్పటి కప్పుకోవడానికి చాలనప్పుడు సమస్యలు తప్పవు. అందుకే అంటున్నాను మొదలు దుప్పటి నెరవు (పొడుగు) పెరిగితే గాని సమస్యకు పరిష్కారం లభించదని! అంటే ఉద్యోగావకాశాలు పెరిగి యువతీ యువకులు తమ కాళ్ళ మీద తాము నిలబడే పరిస్థితులు ఏర్పడి ఆర్థికంగా స్వావలంబనం జరిగితేనే తప్ప ఈ బాధలు పోవు!" ◆

కోతి వరాలిచ్చి.....

కొండమీద కొండముచ్చొకటి
ఆసనం మీదెక్కి కూర్చొని
మౌనిలా జ్ఞానిలా మహా ఫోజిస్తుంది
అంచెలంచెలుగా తానీకొండెక్కానని
కొండరాజ్యం తానే ఏలాలని
దైవాజ్ఞంటూ ధ్యానం చేస్తుంది

చిట్కా వైద్యాలు
జిమిక్కుల చోద్యాలు
గుటకాయ స్వాహా మంత్రాలు
చెట్ల కొమ్మలపై వింత విన్యాసాలు
హమేషా తమాషాల సంత చేస్తుంది

కమ్మగా ధర్మబోధలు నీతి కథలు
నిత్య శ్రమైక జీవన సూత్రాల స్తోత్రాలు
శ్రావ్యంగా వినిపిస్తుంది
కంప్యూటర్‌ను కౌగలించుకుని
ప్రసార మాధ్యమాల్లో దర్శనమిస్తుంది

ఒకోసారి కోతిలా కనిపిస్తుంది
మరోసారి కొండముచ్చై వెక్కిరించి
హైటెక్ గెరిల్లాలా రాజసాలు పోతుంది

పూలూ పండ్లూ రాళ్లూ వెదజల్లుతుంది
మబ్బుల్ని కొమ్మల్లా ఊపి
వానలు చిలకరిస్తుంది
వరాలు వర్షిస్తుంది...
ఉట్టిమీద రొట్టెల మూటబెట్టి
ఉట్టికెగిరి అందుకోమని
పిల్లుల నడుమ తాకట్లు తీర్చే
తీర్పరిగా కోతి ఉన్నదంతా మింగి
గారడీ చూడమని చప్పట్లు కొడుతుంది.

అధికారమనే అందలం
రాజ్యం పాలకుల భోజ్యమనే
సూక్తిముక్తావళి గీతాలను
మధురమైన బాణీల్లో వినిపిస్తుంది
ఊసరవెల్లిలా రంగులు మార్చి
సర్కస్ చిలుకలా సైకిల్ తొక్కుతుంది.

అంతర్జాతీయ సంబంధాలను
[illegible] చూపిస్తూ
ప్రపంచ ఖజానా నుండి అప్పులేసైనా
శ్మశానంలా ఉన్న ప్రాంతాల్ని
సస్యశ్యామలంగా చేస్తానంటుంది

నీళ్ళ కరువు తీర్చేందుకు
కన్నీటి గంగను సృష్టిస్తానంటుంది.

అది మాయలు నేర్చిన కొండముచ్చు
ఊదేదంతా ఊకదంపుల ఉచ్చు
అన్నీ కిందికి దొర్లే కోతి వరాలే
వాటికి తలా తోకా ఒక్కటే
టేకిట్ ఈజీ తగువుండదు.

- అనిశెట్టి రజిత

మట్టిచెట్టు

మట్టికి మొలకెత్తడం తెలుసు
విత్తుకు ఎత్తు పెరగడం తెలుసు
స్వేదం చిందితే సేద్యం
రుధిరం పొంగితే కదనం
స్వప్నం పొదిగితే నూత్న సృష్టి
సత్యం దర్శిస్తే వినూత్న దృష్టి
ఎ[illegible]న కొమ్మ ఆకాశమంతా విస్తరిస్తుంది
గుండెలోతుల్లోకి చొరబడే ఆవేశంలా
కొమ్మలు నరుకుతున్నా చెట్టు వ్యాపిస్తూనే ఉంటుంది
ప్రపంచాన్ని పరుచుకునే సూర్యోదయంలా
మట్టిలోతుల్ని ఎంత చీల్చినా
చేతులు చాస్తూనే ఉంటుంది ఆప్యాయంగా
వెన్నెల జలతారులా, పారే సెలయేరులా
పెరిగిన కొమ్మలకు వరగడం తెలుసు, ప్రేమించడం తెలుసు
కొమ్మలు నరికితే కొత్తపూలు పుట్టుకొస్తాయి
తొలకరిలో చిగురించే నేల గుండెలా
చెట్టును నరికితే కొత్త పాదులుపెట్టుకొస్తాయి
పోటెత్తే సముద్రపు అలల్లా, ముంచెత్తే వరద పొంగులా
బుల్లెట్లతో, బాయినెట్లతో చెట్టుకు గాయం చేస్తే
ఆకులన్నీ బాకులవుతాయి, కొమ్మలన్నీ కత్తులవుతాయి
చీకటిపై నెత్తురు చెరుగుతాయి
చిరుగులపై వెలుతురు చిమ్ముతాయి
కాంతిపుంజం కూతవేటును కారు మేఘం అడ్డుతుందా?
క్రాంతిదీపం వెలుగుదివిటీ చిమ్మచీకటి ఆపుతుందా?
అది ద్రవిస్తే ప్రణయం, దహిస్తే మహాప్రళయం! తస్మాత్ జాగ్రత్త!

- వై.హెచ్.కె.మోహన్‌రావు

* పుప్పాల కృష్ణమూర్తి

ఆహారం విలువ తెలపాలి



పాపిరెడ్డి అంకుల్ ఫంక్షన్‌కు పిలిస్తే వెళ్లాము. వాళ్ళ ఒక్కగానొక్క పాప బర్త్‌డే. కంట్రాక్టర్ కనుక భోజనాలవీ గ్రాండ్‌గా అరేంజ్ చేశాడు. ఫంక్షన్‌లో సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేసే శేషు కలిశాడు. బంధువు కనుక భార్యా పిల్లల్తో వచ్చాడు. మేము రెండు కుటుంబాల వాళ్ళం ఒకే టేబుల్ చుట్టూ కూర్చున్నాం తినడానికి. బఫే కనుక ఎవరిష్టమొచ్చినంత వాళ్ళు వడ్డించుకోవచ్చు. అలాగే వడ్డించుకున్నారందరు కూడా. మాతో పాటు శేషు పిల్లలు కూడా వడ్డించుకున్నారు. పెద్దవాడికి పన్నెండేళ్ళు. పాపకు ఎనిమిది. తినాలనే కోరికతో చాలా పెట్టుకున్నారు ప్లేట్లో. కాని తినలేక మూడు ముద్దలు తిని, పదార్థాలన్నీ అలాగే వదిలేశారు. ప్లేటు నిండా ఆహార పదార్థాలు మిగిలిపోయాయి. రెండు ప్లేట్లలో పిల్లలు వదిలేసిన పదార్థాలు మరో ఇద్దరు పేద వాళ్లకు సరిపోతాయి. మేం భోజనం ముగించి, చేయి కడుక్కోవడానికి వెలుపలికి వచ్చాము. అక్కడ చిన్నగుంపుగా బిచ్చగాళ్ళు కూర్చుని అన్నం కోసం అరుస్తున్నారు. ఆ దృశ్యం చూసిన నాకు చాలా బాధేసింది. పిల్లలు అలా వదిలివేయకుండా ఉంటే వేరే వాళ్ళెవరైనా తినే వాళ్ళుగదా. మిగిలితే ఇలాంటి అన్నార్తులకు పెట్టవచ్చు గదా అనిపించింది.

సాధారణంగా పెళ్ళిళ్లూ, గృహ ప్రవేశాలు మొదలైన ఫంక్షన్‌లు జరిగినపుడు పిల్లల్ని వెంటబెట్టుకుని పెద్దలు వెళ్ళడమనేది కామన్ విషయం. అలా ఫంక్షన్‌లలో భోజనాలు పెట్టడం సర్వసాధారణం కనుక, నలుగురితో కలిసి తినేప్పుడు ఎలా క్రమశిక్షణగా నడుచుకోవాలో ఇంటి వద్దనే పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలి. సామాన్యంగా పిల్లలు ఇంటి వద్ద ఎలా మెలుగుతుంటారో వేరే చోటుకు పోయినప్పుడు కూడా అలాగే ప్రవర్తిస్తుంటారు.

సాధారణంగా పిల్లలకు అనేక విషయాలను తల్లిదండ్రులు బోధిస్తారు. కాని ఆహారం తీసుకోవడం గురించి చెప్పరు. 'ఏముందీ చెప్పేందుకు? ఆకలైనప్పుడు తినగలిగినంత తింటాము దీనికి చెప్పడమేమిటి?' అని కొంతమంది ప్రశ్నిస్తారు. కాని పిల్లలకు మితంగా ఆహారం తినడం గురించి చెప్పాలి. లేకుంటే రుచికరంగా ఉన్నాయి కదా అని అడ్డగోలుగా తింటే అజీర్తితో డాక్టర్ వద్దకెళ్ళాల్సి వస్తుంది. పదిమందితో కలిసి తినేప్పుడు ముందు అన్నీ మనమే వడ్డించేసుకుని, వెనకవాళ్ళకు ఏదీ మిగల్చకపోవడం చెడు పద్ధతని తెలియజెప్పాలి. మనమెంత తినగలమో అంతే పెట్టుకోవడం ఒక మంచి లక్షణమని సూచించాలి. ఇలా తెలియజేయకుంటే పిల్లలకెలా తెలుస్తుంది? 'వేస్ట్ చేస్తే ఏమవుతుంది? మళ్ళీ తయారు చేస్తార్లే వాళ్ళ పాట్లేవో వాళ్ళు పడతార్లే' అనుకుంటారు.

మనం రోజూ ఇంట్లో అన్నం తినేప్పుడు కంచంలోని పదార్థాలు వేస్ట్ చేయకుండా, ఎంత తినగలిగితే అంతే వడ్డించుకుని తినేలా పెద్దలు పిల్లలకు సూచించాలి. అన్నం తినేప్పుడు పళ్ళెం చుట్టూ అన్నం పోగొట్టడమే గాదు, ఇష్టమొచ్చినంత అన్నాన్ని కలిపి కంచంలో వదిలేస్తుంటారు. ఏదైనా ఆహారం వృధా చేయడమంటే, కృత్రిమ ఆహార కొరతను సృష్టించడం లాంటిదే. మానవ జాతికి ద్రోహం చేయడం లాంటిదే. డబ్బుల్ని యంత్రాల ద్వారా ఎన్నయినా సృష్టించగలం అచ్చువేసి. కాని ఆహారాన్నలా సృష్టించలేం. ఆహారం ఉత్పత్తి కావాలంటే ప్రకృతి శక్తుల సహకారం, ఎంతో శ్రమ, మరెంతో సమయం కావాలి. వీలైతే పొలాల్లో పని చేసే రైతుల్ని, కూలీల్ని పిల్లలకు ప్రత్యక్షంగా చూపించాలి. అలాగే అన్నం దొరక్క వీధిన పడే పేదల్ని చూపించాలి. అలా పెద్దలు చేసినప్పుడు తప్పకుండా పిల్లలు ఆహారం విలువను గుర్తించి వృధా చేయకుండా ఉపయోగిస్తారు. అనేక భోజన శాలల్లో 'అన్నం పరబ్రహ్మ స్వరూపం. దాన్ని వృధాపరచడమంటే భగవంతుని పట్ల అపచారం చేయడమే' అనే సూక్తులు గోడల మీద, భోజనం చేసే వాళ్ళకు కనిపించేలా ఉంచుతారు.

ఫంక్షన్‌లకు వెళ్లినప్పుడు కొంచెం వడ్డించుకుని, అవి తినడం పూర్తయ్యాక మళ్ళీ వడ్డించుకోవడం, వృధా చేయకుండా తినడం, అడిగి తీసుకోవడం ఇవన్నీ సంస్కార వంతుల లక్షణం. మన పిల్లల్ని క్రమశిక్షణ కలిగిన పౌరుల్లా సంస్కార వంతులుగా తయారు చేద్దాం. ◆

ఐకమత్యం

పూర్వం ఒక గ్రామంలో రామయ్య అనే వ్యవసాయదారుడు ఉండేవాడు. మొదటినుంచీ కష్టపడి పనిచేసి పదెకరాల పొలం సంపాదించాడు. ఆయనకు ఐదుగురు కుమారులు. వారందరికీ పెళ్లిళ్లు చేశాడు.

అంతా హాయిగా కాపురం చేసుకుంటున్నారు.

కొంతకాలానికి వృద్ధాప్యం మీదపడి, జబ్బు చేసి మంచానపడ్డాడు రామయ్య. తాను ఎక్కువ రోజులు బతకననే అనుమానం కలిగిందాయనకు. ఈలోగా ఈ విషయాన్ని కొడుకులు కూడా గమనించారు. తండ్రి దగ్గరకు వెళ్లి 'నాన్నా! నువ్వు చూస్తే ముసలివాడివయ్యావు. ఆరోగ్యం సరిగ్గాలేదు. బాధ్యతలేవీ చూసే స్థితిలో లేవు. అందుకని ఆస్తిని మాకు సమానంగా పంచి ఇస్తే బాగుంటుంది. మా బతుకు మేం బతుకుతాం' అన్నారు. ఆ మాటలు వినగానే తాను చనిపోయిన తర్వాత వాళ్లెవరూ కలిసి ఉండరనే అనుమానం ఎక్కువైంది రామయ్యకు. అంతా కలిసి ఉండాలనేది ఆయన కోరిక.

వీరి మనసులు మార్చడానికి ఓ ఉపాయం ఆలోచించాడు. మరుసటి రోజు వసారాలో వాలుకుర్చీలో కూర్చుని కొడుకులందరినీ పిలిచాడు. ఇంటి ముందున్న పెద్ద దుంగను చూపించి పెద్ద కొడుకుతో 'దీన్ని పక్కన పడవెయ్యి నాయనా' అన్నాడు. అతడు దాన్ని ఎత్తడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. మిగిలిన నలుగురూ విడివిడిగా ప్రయత్నించి ఒక్క అంగుళం కూడా పక్కకు జరపలేకపోయారు.

తర్వాత రామయ్య అయిదుగురు కొడుకులవైపు చూస్తూ 'మీరందరూ కలిసి దీనిని పక్కన పడేయ్యండి' అన్నాడు. అంతా కలిసి ఆ దుంగను తేలిగ్గా పక్కన పడేశారు. అప్పుడు కుమారులతో రామయ్య 'చూశారా నాయనలారా! ఒక్కరుగా చెయ్యలేని బరువైన పనిని మీరు అయిదుగురూ కలిసి తేలిగ్గా చేయగలిగారు. అలాగే అందరూ కలిసి ఉమ్మడి కుటుంబంగా ఉంటే, ఏ సమస్యనైనా సులువుగా పరిష్కరించుకోవచ్చు. కాబట్టి నేను పోయిన తర్వాత మీరందరూ విడిపోకుండా, ఒకే కుటుంబంగా ఉండి సుఖసంతోషాలతో బతకాలనేది నా కోరిక' అన్నాడు.

దాంతో కుమారులు తండ్రి మాటల్లోని నిజాన్ని గ్రహించి నాన్నా! మేమెన్నటికీ విడిపోము. కలిసి ఒకే కుటుంబంగా వుంటాం' అని మాట ఇచ్చారు. కొడుకుల మాటలు విని రామయ్య ఎంతో ఆనందించాడు. ఇక తాను ఏక్షణంలో మరణించినా ఫరవాలేదనుకున్నాడు.

– పి.ఎం.సుందరరావు



క్విజ్-65

1. కాఫీ ఉత్పత్తికి దక్షిణ అమెరికాలో ప్రసిద్ధిగాంచినది?
   ఎ. చిలీ బి. బ్రెజిల్
2. 1 హెక్టారు అంటే ఎన్ని చదరపు మీటర్లు?
   ఎ. 1000 బి. 10000
3. 'అలీస్ ఇన్ వండర్ ల్యాండ్' రచించినదెవరు?
   ఎ. జార్జి రెవెల్ బి. లూయీస్‌కారల్
4. నడిచే సైకిలులో వున్న చలనం?
   ఎ. స్థానాంతర చలనం బి. భ్రమణచలనం
5. హిమాలయపర్వతాలలో ఎత్తైన శిఖరము?
   ఎ. కాంచనగంగ బి. ఎవరెస్టు
6. ఈజిప్టు వరప్రసాదిని?
   ఎ. నైలు బి. నర్మద
7. భారతదేశానికి అత్యధిక వర్షమునిచ్చే పవనాలు?
   ఎ. నైరుతి బి. ఈశాన్య
8. ఏ చక్రవర్తి కొలువులో నవరత్నములని పేరొందిన కవులున్నారు?
   ఎ. చంద్రగుప్తవిక్రమాదిత్యుడు బి. గణపతిదేవుడు
9. జూనియర్ వింబుల్డన్‌లో బాలికల డబుల్స్ ట్రోఫీని సంపాదించినదెవరు?
   ఎ. సానియామీర్జా
   బి. నవ్రతిలోవా
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. టైసన్
   బి. పేస్



చిన్నారి చిత్రకారులు

ఎ.రమాదేవి, 8వ తరగతి, ప్రగతి విద్యానికేతన్, సరపక.

ఎస్.గోపీచంద్, 10వతరగతి, ఎస్‌విఎస్‌పి స్కూల్ చినకాకాని.

వై.కౌషిక్, విశ్వశాంతి పబ్లిక్ స్కూల్, చినకాకాని.



ఎన్.మేఘన, 2వ తరగతి, సెయింట్ ఆంథొనీ గరల్స్ హైస్కూల్, సికింద్రాబాద్.

జంతువులకే రాజు ఎవరబ్బా!



రెండు రంగుల పువ్వు



హోయ్ మీరు ఎప్పుడైనా రెండు రంగుల పువ్వును చూశారా! లేదా? అర్రెర్రే...! చూడలేదా. అయితే ఇవాళ చూస్తారా. ఈ బొమ్మలో వున్న పువ్వు రెండు రంగులదే. దీన్ని కావాలంటే మీ ఇంట్లో కూడా పెట్టుకోవచ్చు. అదెలాగో చెప్పుకోండి చూద్దాం. చెప్పలేరా? అయితే నేనే చెప్తాను. ముందు రెండు గాజు గ్లాసులు తీసుకోండి. కొద్దిగా వెలితి వుండేట్టు నీళ్లు నింపండి. ఇప్పుడు ఏం చేయాలంటే ఒక గ్లాసు నీళ్లల్లో ఎరుపు రంగు కలపాలి. మనం ఒక్కోసారి ఆహారపదార్థాల్లో రంగులు కలువుతుంటాంకదా. ఏంటి అలా చూస్తున్నారు. ఊ.... మీకు జాంగ్రీ అంటే ఇష్టమేనా? అందులో రంగు కలుపుతారు. అందుకనే చూడగానే నోరూరేలా కనిపిస్తుందది. సరే. ఇందాక మనం ఎక్కడి వరకు చెప్పుకున్నాం. ఆ... రంగు కలిపేదాకా. ఎరుపు రంగుని గ్లాసు నీళ్లల్లో కొద్దిగా కలపండి. ఆ తర్వాత మీకు ఒక తెల్లటి పువ్వు కావాలి. దాని కాడ పొడవుగా వుండాలి. ఆ కాడను జాగ్రత్తగా మధ్యలోకి నిలువుగా చీల్చాలి. పూర్తిగా కాదు. బొమ్మలోలాగా. ఆ తర్వాత రెండు కాడలను రెండు గ్లాసులలో మునిగేట్లు పెట్టాలి. కొన్ని గంటల తర్వాత చూస్తే తెల్లటి పువ్వు సగం తెల్లగాను, సగం ఎర్రగాను కనిపిస్తుంది. మరి ఇదే ఈ వారం మేజిక్. సులభమైన మేజిక్.

మేజిక్! మేజిక్!!

క్విజ్ 64 జవాబులు

1.కోల్‌కతా 2. గాలి 3. జోన్నె కాథలీన్ రౌలింగ్ 4. బ్యాక్టీరియా 5. ఆమ్లజని 6. వజ్రము 7. నిజామాబాదు 8. 360 డిగ్రీలు 9. చిక్కుడు గింజ 10. బియాట్రిజ్ మెరినో

క్విజ్ 63కి సరైన సమాధానాలు రాసిన వారు :

సి.మాధవి, 10వ తరగతి, **వి.ప్రియాంక** 10వ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం. **టి.యమున**, 9వ తరగతి, **డి.జవహర్**, 8వ తరగతి, పొన్నూరు, గుంటూరు. **టి.మాధవరావు**, 10వ తరగతి, గవరపాలెం, విశాఖ. **రాహుల్‌కుమార్**, అనకావల్లి, విశాఖ. **ఎం.వివేకవర్ధిని**, 7వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **కె.జంగు**, 7వ తరగతి, లక్ష్మినగర్, మెదక్.

కలం స్నేహం

పేరు: కె.ప్రమీల,
వయసు : 10సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : చదవడం, పాటలుపాడడం, ఆటలు ఆడడం, డ్రాయింగ్ వేయడం, డాన్స్ చేయడం.
పూర్తి చిరునామా : కె.ప్రమీల, 5వ తరగతి, రాహుల్ స్కూల్, చీరాల, ప్రకాశం.

పేరు:టి.ఎన్.భవానిశంకర్,
వయసు : 14సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం.
పూర్తి చిరునామా :ఎన్.భవానిశంకర్, సన్నాఫ్ ఎన్.కోటేశ్వరరావు, తుళ్లూరు, గుంటూరు.

పేరు:జి.కృష్ణకుమారి,
వయసు : 13సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : మంచిమంచి బొమ్మలను అందంగా వేయడమంటే చాలా ఇష్టం.
పూర్తి చిరునామా :జి.కృష్ణకుమారి, డాటరాఫ్ వెంకటేశ్వర్లు, పుల్లల చెరువు, ప్రకాశం.

నక్షత్రాలు-ఆవాలు

అక్బర్-బీర్బల్ కథలు

ఓరోజు అక్బర్ చక్రవర్తి అంత:పురంలో విహరిస్తున్నాడు. ఆకాశం నిర్మలంగా ఆహ్లాదంగా వుంది. చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. వాటిని చూడడంతోటే అయనకు ఓ చిలిపి ఆలోచన వచ్చింది. తర్వాత వెంటనే నవ్వు కూడా వచ్చింది.

మరుసనాడు సభలో అందరూ తమ తమ స్థానాల్లో కూర్చుని వుండగా తనకు రాత్రి వచ్చిన ఆలోచన గుర్తుకొచ్చింది. అప్పుడు సభలోని వారందరినీ ఒకసారి పరికించి చూచి 'అందరూ జాగ్రత్తగా వినండి. మీరెవరైనా ఆకాశంలోవున్న నక్షత్రాలను లెక్కించగలరా? లెక్కించి చెప్పినవారికి వెయ్యి బంగారు నాణేలను బహూకరిస్తాను. ఇందుకుగాను 15 రోజుల గడువుకూడా ఇస్తాను' అన్నాడు.

చక్రవర్తి చెప్పిన గడువు రోజు రానేవచ్చింది. అప్పటికి అందరూ హాజరయ్యారు. కాని బీర్బల్ మాత్రం రాలేదు. ఐదు నిముషాల తర్వాత బీర్బల్ వచ్చాడు. ఆయన వెనకే ఒక సేవకుడు చిన్నపాటి మూట తీసుకొచ్చి పాదుషావారి ముందు పెట్టాడు. అదిచూసి ఆశ్చర్యపోయిన అక్బర్ 'ఏమిటది బీర్బల్?' అని ప్రశ్నించాడు. 'మహారాజా! నేను ఆకాశంలోని నక్షత్రాలను లెక్కించేటప్పుడు పక్కన ఒక ఆవాలగోతాం పెట్టుకున్నాను. ఒక్కో నక్షత్రాన్ని లెక్కించగానే ఖాళీ గోతాంలో ఒక్కో ఆవాలగింజను వేశాను. ఆకాశంలో ఇన్ని నక్షత్రాలు వున్నాయి. ముందు వీటిని లెక్కపెట్టించండి. అప్పుడు ఆకాశంలో వున్న నక్షత్రాలు ఎన్నో తెలిసిపోతాయి' అన్నాడు.

ఆకాశంలోని నక్షత్రాలను లెక్కించడం సాధ్యంకాదని అక్బర్‌కూ తెలుసు. కానీ తన ప్రశ్నకు యుక్తితో సమాధానం చెప్పిన బీర్బల్‌ను మెచ్చుకుని తాను ముందుగా ఇస్తానన్న బంగారునాణేలతో సత్కరించాడు.

నోబెల్ బహుమతి కథాకమామీషు

ప్రతి సంవత్సరం నోబెల్ బహుమతులు ఇస్తారని తెలుసుగా! అయితే ఆ బహుమతుల కథాకమామీషు తెలుసుకుందామే. స్వీడన్ దేశంలో 1833వ సంవత్సరంలో ఆల్ఫ్రెడ్ నోబెల్ జన్మించారు. ఆయన మంచి శాస్త్రవేత్త, పరిశోధకుడు, ఆవిష్కర్త. డైనమైట్‌తోపాటు ఎన్నో విశేషాలను కనుగొన్నారు. తన ఆవిష్కరణలద్వారా బోలెడంత ధనం సంపాదించారు. తన సంపాదనను శాస్త్రీయ రంగానికి, ప్రపంచ శాంతికి ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నారు.

ఆయన 1895లో నవంబరు 27న రాసుకున్న వీలునామాలో నోబెల్ బహుమానాల గురించి రాశారు. ఆ తర్వాత సంవత్సరానికి 1896, డిసెంబరు 10వ తేదీన నోబెల్ మరణించారు. 1900లో ఆ ఆస్తిని చూడడానికి నోబెల్ ఫౌండేషన్ స్థాపించారు. ఈ సంస్థ ద్వారా 1901 నుంచీ భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, వైద్యశాస్త్రం, సాహిత్యం, శాంతి రంగాలలో నోబెల్ బహుమతి ఇస్తున్నారు. 1968నుంచి ఆర్థికశాస్త్రంలో కూడా ఈ బహుమతి ఇస్తున్నారు. ఆయారంగాలలో పరిశోధన, కృషి చేసిన వారికి ప్రతి డిసెంబరు 10వతేదీన స్వీడన్‌లో జరిగే ఉత్సవంలో నోబెల్ బహుమతుల ప్రదానం చేస్తారు. బహుమతి గ్రహీతలకు ఒక డిప్లొమా, ఓ బంగారు పతకం, నగదు బహుమానం లభిస్తుంది. ఇక వారం వారం ఈ బహుమతి పొందిన ఒక్కొక్కరి గురించి తెలుసుకుందామే.

డా. కాకర్లమూడి

ఒక్కసారి ఛాన్సివ్వండి

ఆ రోజు పొద్దున్నే ఊరు వులిక్కిపడింది - జక్కులోడు చీదరగా రావిచెట్టు కిందికి చేరేసరికి మల్లేశు మటమట లాడిపోతున్నాడు. ఊరంతా సందడిగా కోలహలంగా వుంది. "ఏందిర ఏంది సంగతి" జక్కులోడు అడిగాడు.

''ఏవుందీ... దొంగ మల్లిగాడ్ని తెల్లారురూమున వీరసామింటికాడ పట్టుకున్నారు...

జక్కులోడి చికాకంతా ఎగిరిపోయింది. బుర్రంతా పని చేయడం మానేసింది. హుషారుగా ఓసారి ఈలేశాడు. వాడి గంపకింద రెండు కోడిపుంజుల్ని జాడాపత్తా లేకుండా తీసి ఖతం చేసినందుకు జక్కులోడు ఇవ్వాల్టిదాకా గుర్తుకు వచ్చినపుడల్లా గురగురలాడిపోతూనే వున్నాడు.

"అరె... వాడెట్ల దొరికిందురా...

"అదే... ఈరసామి... వాడిపెండ్లాం బువ్వలు తిని పండుకున్నారు. కరువు దెబ్బకు మేతలేక వాడు కురవి అంగట్లె వాడిరెండు బక్క ఎడ్లను ఇవ్వాళ్నె అమ్మిన సంగతి వీడికెట్ల మతలబయిందో తెలవదు. పదిహేనొందల క్యాష్ - పెంకుటిల్లాయె... గుడ్డల సుట్టి పెట్టి దాచుకున్న సంగతి వీడెట్ల కనిపెట్టిండో అర్థంకా దొరే..

జక్కులోడికి వళ్ళు మండిపోయింది. "దొంగ మల్లిగాడికి గజకర్ణ.. గోకర్ణ టక్కు టమార విద్యలూ... మశయాలం. మంత్రాలో తెలుసు... నీకెందుకుబే...

"అహఁ... అర్ధరాత్రి కాడ సల్లంగ గోడకు బొక్క చేసి లోపలికి ముందుకాళ్ళు నూకిండట.... వాడి మంత్రం సంగతి నాకు తెలవదు కానీ... అక్కడే చాపేసుకుని పండుకున్న వీరసామిగాడి పెండ్లాన్ని. వాడి మంత్రం కనిపెట్టలేకపాయె... సరిగ్గ వాడి కాళ్ళు ఆమె ముఖం మీదికి పోవడంతో ఆమె హడలి పోయి అధాటున ఆరెండు కాళ్ళూ దొరకబుచ్చుకుని ఒకటే కేకలకు తగులుకుంది. మల్లిగాడు కన్నంలోనే గిలగిల కొట్టుకుంటున్నా ఈరసామి పెండ్లాం చచ్చినా వదలకుండా బిగదీసి పట్టుకుని గోలకు తగులుకుందామె... కసిదీరా వాడి మోగాలు పిక్క కసిక్కున ఒడిసి పట్టి పండ్లతో ఝాడించి కొరకడంతో రగతం..' మల్లిగాడు ఆ దెబ్బకు అరుపులకూ... హాహాకారాలకూ తగులుకొంగనే అంతా లొల్లి లొల్లి...

మల్లిగాడుముందు రోజుల్లో అణాకానీ చిల్లర మల్లర చేతివాటం పనులు చేసుకుంటుండేవాడు. పెరట్లో మొక్కజొన్న కండెలు... సొరకాయలు.. గోంగూర వంటి చితక దొంగతనాలు చేసి చేసి డబ్బా దుకాణాల చెక్కలు విరిచి బీడీ, సిగరెట్లు రాత్రిపూట లాగించే స్థాయికి కూడా చేరిపోయాడు. అయితే వాడ్ని జనం చూసీ చూడనట్లు వూర్కుండి పోయారో... 'మనకెందుకులే అనుకున్నారో' గానీ-వాడు మాత్రం తన చోరకళతో అంచెలంచెలుగా ఎదిగి ఆ ఏరియాలోనే గట్టి 'పిండం'గా ప్రసిద్ధి గాంచాడు. దాంతో గూట్లో కోళ్ళు.. కొట్టంలో గొర్రెలు... ఇళ్ళలోని బంగారం... తలుపుల తాళాలు బద్దలు కావడం.. ఇత్యాది పనులు జరిగిపోతుంటే జనాలు హడలిపోతున్నారు.

అపుడే మల్లిగాడ్ని తాళ్ళతో పెడరెక్కలు విరిచి కట్టి తలా ఒక గుద్దు గుద్దుతూ బూతులు తిడుతూ

రావిచెట్టు దగ్గరకు లాక్కువచ్చారు. పిక్క నుండి రక్తం ఓడుతూ వాడు లబలబలాడుతూ కుంటుతున్నడాయె... జక్కులోడికి వళ్ళంతా మంట మండి పోయింది.. బంగారం లాంటి తన రెండు కోడిపుంజులాయె!

"ఒరే... ఒరే... జర గా తన్నుడాపండి... సస్తడు... గదిసరెగానీ... ఇంతకీ వాడు ఏమంటాడు... సూటిగా కన్నంలోనే దొరికి పోయిండు గదా...!" వీరసామిని అడిగాడు వాడనలే కోపంతో వూగిపోతున్నాడు. వీడ్ని తన్నాలని గాని లేదే... పోలీసు ఠాణాలో అప్పజెప్పితే వాళ్ళే సూసుకుంటారు గానీ... వీడ్నీ.... (మళ్ళా మల్లిగాని డొక్కలో ఓ తన్ను తన్నాడు)... వీడు మాట్లాడేది అంతా ఎడ్డెం తెడ్డెం యవ్వారమాయె... తన్నకుంట ఇంగ ఎట్ల వూరుకునేది..." అని రొప్పుతూ అన్నాడు. జక్కులోడు మల్లిగాని జుట్టు పట్టిలేపి అడిగాడు. "ఏందిర మల్లిగా.. ఇంగ ఎంత కాలం ఈ పని... ఊర్లె ఒక్క లోలూ... లోటా... కోడీ మిగిల్నియవాయె... బొక్కల్లో నూకి బొక్కలు గరం గరం చేస్తే.... ఓ ఆర్నెల్లు జైలు కూడు తింటెగానీ నీకు బుద్ధి రాదుర... ఛు!" ఖాండ్రించి వుమ్మాడు..

"అన్నా... ఈ ఒక్కసారికి ఒక్క చాన్సిచ్చి చూడే....!" మల్లిగాడు అరిగిపోయిన గ్రాంఫోను రికార్డులా అన్నాడు. ఈరసాయి అంతెత్తున ఎగిరి తలమీద వెంట్రుకలు రెండు పిడికిళ్ళు పీక్కున్నాడు.. "ఒర్నీ.. గదే... గదే...గదే... గా మాటనకుండా మరో నాలుగు తన్నులు తన్నవే అన్నా.. మళ్ళా ఒక ఛాన్సంటాడు... గదేంమాట... తన్ను... తన్ను.." అని రంకెలేశాడు. జక్కులోడికి మల్లిగాడంటున్న మాట ఎక్కడో విన్నట్లనిపించి నిట్టూర్చాడు. జనాలు పోలోమని వాడ్ని పోలీసు స్టేషన్కి తీసుకుపోయారు.

"ఏందిర మల్లేశా వాడనేది... ఒక్క చాన్సియ్యమంటడు.. అంటే మళ్ళా మరికొన్ని బొక్కలేయడానికా...!'' జక్కులోడు అయోమయంగా అడిగాడు. అప్పటికి మల్లిగాని జాతర వెనకనే పోలీసు స్టేషను కాడికి చేరుకున్నారు. అక్కడ సీను యమ రంజుగా వుంది-

"ఓరి జక్కులోడా... ఇక్కడో కథ... కరంటు ఇంజనీరుగార్ని యాంటీకరప్షను విజిలెన్సు వాండ్లు లంచం తీసుకుంటుంటే రెడ్యాండుగా పట్టుకున్నారు... సూడు... సూడు.!" అక్కడే వున్న యాద్గిరి హుషారు చేస్తూ అన్నాడు.

లోపల ఎలక్ట్రిసిటీ ఇంజనీరుగారు కుర్చీలో నిండుగా నింపాదిగా ఇరుక్కుని కూచుని వున్నాడు.

"పదివేలే గద సార్... వాండ్లకేమో అర్జంటుగా మీటరివ్వాలె... కరంటు పోల్సు... పైన పర్సంటేజీలు.. వైర్లులాగాలె... మామూళ్ళు... ఏదో ఖర్చుల కోసం అడిగాను... .. ప్లీజ్... మరొక్క అవకాశం ఇచ్చి చూడండి" నేను చెయ్యాల్సింది చాలా వుంది... మరొక్క ఛాన్సివ్వండి.. ప్లీజ్" ఆయనగారు ఇంగ్లీషు తెలుగు కలిపి తన వాదన వినిపిస్తున్నాడు.

జక్కులోడు కిటికీలో నుండి కిందికి జూరాడు.

"ఇదేందిరా పదివేలే... మళ్ళా అవకాశం అంటూ... మరో ట్రాన్స్‌ఫార్మరో... లారీలో లక్షలకు అమ్ముకోడానికే... హత్తెరి!" జక్కులోడు పండ్లు పటపటకొరికాడు.

"ఒరే వీళ్ళే కాదురా... ఈ ఇంజనీరు... ఆ దొంగమల్లిగాడే కాదు.. ఈ 'ఒక్క ఛాన్సివ్వండి' అనీ "ఒక్క అవకాశం ఇవ్వండి" అని... అట్లా ఇస్తే మళ్ళా మా దెబ్బ రుచి ఏంటో చూపిస్తామనీ... చేసిందానికి మరి పదింతలు చేస్తామనీ మన భా.జ.పా. వెంకునాయుడు దండాలు పెడుతూ ప్రజలకు చెప్తున్నాడు. ఇప్పటివరకూ ఛాన్స్ తీసుకుని వీళ్ళు ఈ దేశానికి వెలగబెట్టింది చాలు" మళ్ళా వాండ్లకు మరో 'ఛాన్సిచ్చామా' మనపని గోవిందా".

యాద్గిరి మాటలకు జక్కులోడు నిరుత్తరుడయ్యాడు.

◆



ఆదుకో తల్లీ

ఇప్పుడే కాదు - ఎప్పుడైనా సరే!
ఆడవాళ్ళు మెచ్చుకునే సినీమాకి గ్యారంటీ ఎక్కువ!
సరైన కథ దొరకాలేగాని - పెట్టుబడికి ధోకా వుండదు!

లాభాలంటారా? మహిళా సెంటిమెంటు ఎంత ఎక్కువగా వుంటే అంత ఎక్కువ లాభాలు మూటకట్టుకోవచ్చు! పెద్ద కుటుంబం. అయిదుగురు కూతుళ్ళు ఒకే ఒక్క కొడుకు. తండ్రి సంపాదన చాలదు. ఇంతమందిని ఎందుక్కన్నావని కోప్పడితే - ఆ తండ్రి మహాశయుడు కన్నీళ్ళెట్టుకుంటాడే గాని సరైన సమాధానం చెప్పడు. చెప్పలేడు!

ఖర్మంటాడు. గీతంటాడు. అంతే! మొట్టమొదటి సంతానం కొడుకే! ఆ కొడుకు అప్రయోజకుడు. బాగా చదువుకో మంచి ఉద్యోగం వస్తుందని తండ్రి మహాశయుడు విన్నపాలు ఎన్ని చేసుకున్నా ఆ కొడుకు వినిపించుకోడు. మనకి చదువు వంటబట్టదని చెప్పడం అతనికి అలవాటై పోతుంది! ఇప్పుడు కాకపోయినా - మునుముందు ఉత్తమ పురుషుడవుతాడనే ఆశతో - తండ్రిగారు తన రెక్కల కష్టాన్ని కేవలం కొడుకు కోసమే ఖర్చు చేస్తుంటాడు. ఆ విధంగా ఉన్నదంతా సుపుత్రుడి కోసం ఊడ్చి పెట్టేస్తాడు!

తండ్రిగారు ఇస్తున్న ఆర్థిక మద్దతుతో సుపుత్రుడు బాగుపడకపోగా - అచ్చోసిన ఆంబోతులా మారిపోతాడు. ఇల్లాంటి దిక్కుమాలిన పరిస్థితుల నేపథ్యంలో - ఆ కుటుంబ పోషణ బాధ్యతను పెద్దకూతురు తీసుకుంటుంది. నాన్నా నీకు సాయంగా నేను వున్నానని తండ్రికి ధైర్యం చెబుతుంది. తన వాళ్ళ క్షేమం కోసం, బాగుకోసం రెక్కలు ముక్కలు చేసుకుని అహర్నిశలు శ్రమిస్తుంది. సంగీత పాఠాలు చెబుతూ గడిస్తుంది. విస్తళ్లు కుట్టి సంపాయిస్తుంది. చిన్న పిల్లలకు అ, ఆలు చెప్పి అంతోఇంతో ఆర్జిస్తుంది. విశ్రాంతి అనేమాటకి అర్థం లేకుండా చేసుకుంటుంది. సొంత సుఖాన్ని గాలికొదిలేస్తుంది. పెళ్ళి పెటాకులు వద్దంటుంది. అన్నగారికి అడిగినంత ఇస్తుంది. చెల్లాయిలను చదివిస్తుంది. తల్లిదండ్రులను కళ్ళకు రెప్పలా చూసుకుంటుంది. ఆ విధంగా ఆమె ఆ ఇంటికి కొవ్వొత్తిగా మారిపోతుంది. తాను కాలిపోతూ ఆ ఇంటికి వెలుగునిస్తుంది!

ఇల్లాంటి సినీమాలు మహిళాదరణకు నోచుకోవడం వల్ల - ఆ సినీమాలు కనకవర్షాన్ని కురిపిస్తుంటాయి! అంచేత - సినీమాల్లో ఆడా మగా తేడాల్లేవంటే ఎల్లా అంగీకరిస్తాం? మహిళా సినీమాలకు లాభాలెక్కువని మనకేకాదు - సినీమాలు తీసేవాళ్ళకుక్కూడా బాగా తెలుసు! కాకపోతే - మంచికథలు దొరక్క - ఇప్పుడు లేత ప్రేమ కథలకు మొగ్గుతున్నారంతే! కాలేజీలు ప్రేమకి నిలయాలంటున్నారు. లెక్చరర్లు ఉత్త బఫూన్లంటున్నారు. పగలే వెన్నెలంటున్నారు. ఈ టైపు సినీమాలకు కుర్రకారు కిర్రెక్కిపోతున్నారు. నిర్మాతల పెట్టుబడికి గండి పడకుండా హామీలిస్తున్నారు. ఈ బాపతు విన్యాసం తాత్కాలికమే! ఆడవాళ్ళ సినీమాలు ఇప్పుడే కాదు - ఎప్పుడు తీసినా ధోకా వుండదు. ఆడవాళ్ళ ఆదరణతో ఆ సినీమా కనకవర్షానికి దారితీస్తుంది!

మగవాళ్ళకి సినీమా మీద అంత ఇంట్రెస్టుండదు. చీకటిపడగానే - వాళ్ళకి సినీమా కంటే ముఖ్యమైన గొడవలనేకం వుంటాయి. వాటిని విడిచిపెట్టి మూడుగంటల పాటు సినీమాకి అంకితమై పోవడం వాళ్ళకిష్టముండదు. వాళ్ళు సినీమా అంటూ చూడవలసి వస్తే - అందులో వాళ్ళకి బోలెడు పాయింట్లు నచ్చాలి. నచ్చకపోతే టిక్కెట్టు పైకం వాపసు ఇవ్వబడుననే ప్రకటనలుండాలి. అపాటి హామీ ఇస్తేనేగాని మగవాళ్ళు టిక్కెట్టు కొనరు. పాపం ఆడవాళ్ళు ఇన్ని మడత పేచీలు పెట్టరు. రోజంతా బండెడు చాకిరీతో అలిసి పోయి వుంటారు. కొంచెం రిలాక్సవ్వాలనుకుంటే మగవాళ్ల మాదిరి వాళ్ళకి ప్రోగ్రాంలుండవు. టీవీలూ సినీమాలే వాళ్ళకి దిక్కు! వాటిల్లో కథలు ఎట్లా అఘోరించినా సర్దుకుంటారు. అక్కడక్కడా... అవసరమున్నా లేకపోయినా... ఆడవాళ్ళ కష్టాలూ, కన్నీళ్ళూ చూపిస్తే చాలు... కరిగిపోతారు. సినీమా చూస్తూ ఏడుస్తారు. ఏడుస్తూనే ఎదురింటి ఆడపడుచుకో, పక్కింటి పిన్నిగారికో కథ చెబ్తారు!

కథ విన్న ఇల్లాలు ఆ సినీమా తప్పకుండా చూడాలని ఒట్టేసుకుంటుంది. సినీమా చూస్తూ ఘొల్లున ఏడవాలని ముచ్చట పడుతుంది. ఒక్కర్తె వెళ్ళలేదు. వెళ్ళకూడదు. అంచేత భర్తని తోడు రమ్మని అడుగుతుంది. అతను మామూలుగానే వీల్లేదు పొమ్మంటాడు. ఇంకా పంతం పడితే - పిన్నిగార్నో, వదిన గార్నో తోడు తీసుకెళ్ళమంటాడు. వాళ్ళ టిక్కెట్టుక్కూడా తానే డబ్బిస్తానంటాడు. ఆ విధంగా ఒక మహిళ సినీమా చూడాలనుకుంటే - ఆమెతో పాటు వచ్చే ఆడ జనాభాని కలుపుకుంటే - అయిదో ఆరో టిక్కెట్లు తెగుతాయి! ఆ టిక్కెట్ల బలంతో వారం రోజుల్లో లేచిపోయే సినీమాకి - అయిదో ఆరో వారాల దశ కలుగుతుంది. అంచేత సినీమా అంటూ తీస్తే -అందులో అంతో ఇంతో ఆడపాయింట్లు వుండాలని సినీశాస్త్రం చెబుతోంది!

సినీమా పేరులో కూడా ఆడవాసన చాలా అవసరమని సినీమా ఆచార్యులు చెబుతుంటారు. అది వీరఫైట్ల సినీమా కావచ్చు. ఘోర బూతు సినీమా కావచ్చు. పేరు మాత్రం - మా చెల్లెలు దేవతనో, అమ్మా అన్నం పెట్టు అనోవుండాలి. గొప్ప మహిళా చిత్రమని నిర్మాతలే బిరుదిచ్చుకోవాలి. ఇంకా ఆ సినీమాకి ధోకా వుండదు గాక వుండదు. అయినా సినీమా అన్నతర్వాత బూతులేకుండా ఎందుకుంటుంది! నబూతో నభవిష్యతి అన్నారు కూడాను! బూతులేని సినీమాకి భవిష్యత్తు లేదని అర్థం గదా? కనక బూతు గురించి పట్టించుకోనక్కర్లేదు. పద్నాలుగు రీళ్ళ సినీమాలో - చెల్లెలు సెంటిమెంటో, తల్లి అవస్థలో అక్కడక్కడా సేంపిల్‌గా గుమ్మరిస్తే చాలు! మహిళా లోకం చెల్లీ తల్లీ కష్టాలకు తల్లడిల్లిపోతారు. అంతేకాదు - చిత్రంలో హీరోయిన్ మొత్తం ఎన్ని చీరెలు మార్చిందో లెక్కపెడతారు. ఒకరు చెప్పిన లెక్క ఇంకొకరికి తప్పనిపిస్తుంది. ఆవిడ పదహారంటారు. ఈవిడ పద్దెనిమిదంటారు. ఆ లెక్క తేలేంతవరకు - ఆ ఇద్దరూ ఎన్ని తడవలైనా చూస్తారు - ఆ మహిళా చిత్రాన్ని! ◆

✳ ఎన్.వి.శేఖర్‌బాబు



మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

సకల జనావళికి సహృదయంతో స్వాగతం పలుకుతూ మత సామరస్యానికి ప్రతీకగా వెలసినది పెనుకొండలోని శ్రీబాబయ్యస్వామి దర్గా. హిందూ, ముస్లింల ఐక్యతకు కలకాలం నిలిచిపోయే చిహ్నం ఈ దర్గా. బాబయ్యస్వామి దర్గాకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి సుదూర ప్రాంతాలనుంచి కుల, మత భేదాలు లేకుండా వచ్చి దర్శించుకొంటుంటారు. ప్రతి సంవత్సరం శ్రీబాబయ్య స్వామి వారి ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

730 సంవత్సరాలకు పైగా ప్రతి ఏడు క్రమం తప్పకుండా నిర్వహించే ఈ ఉత్సవాల్లో వేలాది మంది కుల, మత, ప్రాంతీయ భేదభావాలు లేకుండా పాల్గొని భక్తి శ్రద్ధలతో శ్రీ బాబయ్య స్వామిని కొలుస్తుంటారు. శ్రీబాబయ్య స్వామిని నమ్ముకొని కొలిచే భక్తులకు సర్వరోగాలు, సమస్యలు తీరిపోతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. మతసామరస్యానికి అద్దం పట్టేలా శ్రీబాబయ్య స్వామి ఆధ్యాత్మిక ప్రసంగాలు ప్రజాదరణ పొంది నేడు కూడా హిందూ, ముస్లింలనే భావన లేకుండా దర్గాలో పూజలు నిర్వహిస్తుంటారు. క్రీ.శ. 663 సంవత్సరంలో శ్రీబాబయ్య స్వామి (హజరత్ బాబా ఫక్రొద్దీన్) పెనుకొండకు వచ్చాడని, ఇక్కడే క్రీ.శ. 694లో కన్ను మూసినట్లు ఆధారాలున్నాయి. ఆనాటి నుండి ఆయన పేరుతో దర్గా వెలిసింది. ఆయన గుర్తుగా ప్రతి ఏడు ఉరుసు నిర్వహిస్తున్నారు. బాబా ఫక్రొద్దీన్ జన్మస్థలం ఇరాన్ దేశంలోని సిస్తాన్ పట్టణం. ఆ పట్టణ చక్రవర్తిగా రాజ్యపాలన చేస్తూ ప్రజలను తన కన్న బిడ్డలుగా చూసుకొనేవాడు. ఆ సమయంలో ఒక తప్పు చేసినందుకు భగవంతునికి భయపడి రాజ్యాన్నే త్యజించాడు. తాను చేసిన తప్పుకు పాప విమోచనం చేసుకొనేందుకు గురువును అన్వేషిస్తూ భారతదేశానికి వచ్చి తమిళనాడులోని తిరుచునాపల్లిలో హజ్రత్ సత్తాహార్ తబరే ఆలంబాద్‌షాను గురువుగా పొందాడు. మతాలు వేరైనా దేవుని చేరుకోవడానికి మార్గం ఒక్కటేనని ఆయన ఉపదేశించాడు. సర్వమానవ సౌభ్రాతృత్వం, శాంతి, సామరస్యాలను ప్రజలకు బోధిస్తూ దేశాటన చేస్తూ పెనుకొండ చేరుకొని, దాన్నే నివాస స్థలంగా చేసుకోమని గురువు ఆదేశించారు గురువును వదలి వెళ్ళలేక బాబా దుఃఖించాడు. పెనుకొండ ఎక్కడ వుందో తనకు తెలియదని బాబా గురువుకు విన్నవించుకోగా గురువు తాను పండ్లు తోముతున్న కట్టెపుల్లనిచ్చి నీవు రాత్రిళ్ళు బస చేసే ప్రదేశంలో నాటి నిద్రపోవాలని, ఏ ప్రాంతంలో అయితే అది చిగురిస్తుందో అదే నీ స్థిర నివాసమని ఉపదేసించి పంపించాడు. గురువు ఆదేశానుసారం బాబా ఫక్రొద్దీన్ ఆనాటి నుండి పలు ప్రాంతాలు పర్యటిస్తూ, గురువు ఆదేశాలను పాటిస్తూ పెనుకొండ చేరాడు. కోట బయట తూర్పు గుట్టలకు ఆనుకొని వున్న ఒక మండపంలో బస చేసిన బాబా ఫక్రొద్దీన్ యథావిధిగా రాత్రి పడుకొనే ముందు గురువాజ్ఞ మేరకు ఎండుపుల్లను నాటి నిద్రించాడు. ఉదయం లేవగానే ఆ పుల్ల చిగురించి వుండటంతో అదే తన గురువు ఉపదేశించిన ప్రదేశంగా భావించి స్థిరనివాసం ఏర్పరచుకోవడం జరిగిందనే కథ ప్రచారంలో ఉంది. ప్రజలకు మహిమలు చూపుతూ, మత సామరస్యానికి శాంతిని ఉపదేశిస్తూ ఖ్యాతి పొందాడు.

దర్గా విశేషాలు :

దర్గా మొదటి ద్వారాన్ని 'జాల్ కా దర్వాజా' అంటారు. దీన్ని దాటి లోపలకు వెళితే కుడి పక్కన వున్న ఫకీరుల చౌక్‌ల మండపాలు, వాటికెదురుగా జోగి కూర్చొనే మండపాలు దర్శనమిస్తాయి. ఇక రెండో ద్వారమైన 'నగార్ ఖానేకా దర్వాజా'. దీని పై అంతస్తులో నగరుఖానా వుంది. అప్పట్లో ఉదయం, సాయంత్రం నగారాలతో పాటు నౌబత్ (షహనాయి) వాయించేవారు. మసీదుకు కుడిపక్క బాబా దర్గా వుంది. పూర్వం ఇది దేవస్థాన మండపం. బాబా పరమపదించిన తరువాత ఇందులోనే సమాధి చేసి దర్గా నిర్మించారు. నాటి బాబయ్య బోధనలు ప్రజలను విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. పట్టణంలో వున్న ప్రసిద్ధి చెందిన షేర్‌ఖాన్ మసీదు కళావైభవానికి పెట్టింది పేరు. ఈ మసీదు మొత్తం తెల్లరాతితో నిర్మితమై అందరినీ ఆకర్షిస్తోంది. బాబయ్యస్వామి ఉరుసు సందర్భంగా వేలాది మంది వస్తుంటారు. దర్గా ఆదాయం కూడా బాగానే వుంది. భక్తులకు సౌకర్యాలను కలిగించడంలో దర్గా మేనేజ్‌మెంట్ తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ◆

* కె విజయ భాస్కర్

పీట్ సంప్రాస్.. టెన్నిస్‌లో క్లాస్‌గేమ్‌కు మొదటగా చెప్పుకోదగిన ఉదాహరణ. దాదాపు పది సంవత్సరాల పాటు టెన్నిస్‌లో రికార్డులను నమోదు చేసిన తిరుగులేని ఆటగాడు. 1990లో ప్రారంభమైన సంప్రాస్ ప్రభంజనం ఏడు వింబుల్డన్ ట్రోఫీలతో కలిపి 14 గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్‌ను తన ఖాతాలో వేసుకుంది. పురుషుల టెన్నిస్‌లో పవర్‌గేమ్ తిరుగులేని మంత్రంగా చెలామణి అవుతున్న రోజుల్లో టెన్నిస్‌లో క్లాస్‌గేమ్‌తో కూడా ఏ విధంగా ప్రత్యర్థులను చిత్తు చెయ్యొచ్చో చూపిన ఆటగాడు సంప్రాస్. స్ఫురద్రూపి అయిన విగ్రహం, నిదానమైన స్వభావం, వీక్షకులను అలరించే క్లాస్ గేమ్ అతనికి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించిపెట్టాయి.



సంప్రాస్ శకం ముగిసినట్లేనా?

టెన్నిస్‌లో ఒక శకంగా పేర్కొనదగిన పీట్ క్రీడా జీవితానికి త్వరలో తెరపడబోతోందా అనే అనుమానం టెన్నిస్ పరిశీలకులలోనూ, అభిమానులలోనూ కలుగుతోంది. ఈ విషయాన్ని ఈ సంవత్సరం చివరి నాటికి తేల్చి చెబుతానంటున్నాడు పీట్. అయితే ఆ కాలానికి గ్యారంటీ ఇవ్వలేమంటున్నారు క్రీడా పండితులు. 2000 సంవత్సరపు వింబుల్డన్ ఫైనల్‌లో పాట్రిక్ రాఫ్టర్ చేతిలో ఓడిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు అతడు పాల్గొన్న టోర్నమెంట్లు 25. చివరకు పరాజయాలతోనే బయటకు వెళ్ళాడు. ఆండ్రీ అగస్సీ, బోరిస్ బెకర్, జిమ్ కొరియర్ వంటి ఉద్దండులు రంగంలో ఉన్నప్పుడే నెగ్గుకొచ్చిన సంప్రాస్ నేడు పరాజయాల బాటలో పడటం సర్వత్రా ఆశ్చర్యం రేకెత్తిస్తోంది. జూన్ 26వ తేదీన వింబుల్డన్‌లో స్విస్ ఆటగాడు జార్జి బాస్టల్ చేతిలో పరాజయం పాలైన తరువాత సంప్రాస్ విలేకరులతో మాట్లాడుతూ "నేను కష్టం మీద ఇంటికి వెళుతున్నాను, మళ్ళీ తిరిగి వస్తాను. ఎందుకంటే నేను వెళ్ళాల్సింది ఈ రీతిలో కాదు" అని అన్నాడు. క్రీడా పండితులు మాత్రం పీట్ విజయావకాశాలను పూర్తిగా త్రోసిపుచ్చుతున్నారు. మున్ముందు కూడా పీట్ టైటిల్స్ సాధించడం కష్టమేనంటున్నారు.

కెరీర్ ఒడిదుడుకులలో ఉన్నా బెదరక పోవడం అతని లక్షణం. వరుసగా ఓడిపోతున్నా పాల్గొన్న టోర్నమెంట్ల సంఖ్యే దానికి నిదర్శనం. సంప్రాస్ జీవితంలో వర్ధమాన క్రీడాకారులకు ఎన్నో స్ఫూర్తినిచ్చే అంశాలు ఉన్నాయి. పీట్ 1971 ఆగస్టు 12వ తేదీన వాషింగ్టన్ డిసిలో సామ్, జార్జియా సంప్రాస్ అనే గ్రీకు వలస కుటుంబంలో జన్మించాడు. టెన్నిస్ పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. అతను బాగా చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు వాళ్ళ ఇంటి బేస్‌మెంట్‌పై టెన్నిస్ రాకెట్ దొరికింది. దాంతోనే చిన్నారి పీట్ గంటల తరబడి గడిపేవాడు. బంతులను గోడలకు వేసి కొడుతుండేవాడు. అతని ఏడేళ్ళ వయస్సులో వాళ్ళ కుటుంబం ఉద్యోగరీత్యా పాలోస్‌వెర్డాస్‌కు వెళ్ళింది. ఈ మార్పు పీట్ క్రీడా జీవితానికి దోహదం చేసింది. అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. దీంతో వారి కుటుంబం పెన్సిల్వేనియా రిక్వెస్ట్ అనే క్లబ్‌లో సభ్యత్వం తీసుకుంది. అందరూ టెన్నిస్ ఆడేవారు. పదకొండో యేటి కెల్లా సంప్రాస్ మంచి ఆటగాడిగా తయారయ్యాడు. క్రమబద్ధమైన షాట్లు, వ్యాలీలతో చక్కని ఆటగాడిగా తయారయ్యాడు. తరువాత 1990లో యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న అతిచిన్న వయస్కునిగా అతని పేరు విశ్వవ్యాప్తమయ్యింది. అప్పటికి పీట్ వయస్సు 19 సంవత్సరాల 28 రోజులు మాత్రమే. 1988లో 97వ ర్యాంకులో ఉన్నాడు. కానీ అప్పటికే అతనికి "ప్రమాదకరమైన ఆటగాడి"గా పేరు వచ్చేసింది. 93 నాటికి నంబర్ వన్ స్థానానికి ఎదిగాడు. ఈ స్థానాన్ని రికార్డు స్థాయిలో ఐదేళ్ళ పాటు 1998 వరకు 276 వారాలపాటు నిలబెట్టుకున్నాడు. ఇన్నాళ్ళపాటు టెన్నిస్‌లో ప్రపంచ నంబర్ వన్‌గా వెలిగింది పీట్ ఒక్కడే. తరువాత పాల్గొన్న మేజర్ టోర్నమెంట్లన్నీ గెలుచుకున్నాడు. అతను గెలుచుకున్న ఏడు వింబుల్డన్ టైటిల్స్ ఎనిమిదేళ్ళ వ్యవధిలో గెలుచుకున్నవే. ఒక్క ఫ్రెంచ్ ఓపెన్ తప్పించి. అది ఇప్పటికీ పీట్‌కు అందని ద్రాక్షే. క్లే కోర్టులపై ఆడటమంటేనే పీట్‌కు భయమట. ఎంతో పోటీ ఉన్న పురుషుల టెన్నిస్‌లో ఇతరులెవ్వరూ సాధించనన్ని ఘనతలను సంప్రాస్ సొంతం చేసుకున్నాడు. 14 సింగిల్ టైటిల్స్ ఇప్పటికి అత్యధిక రికార్డు. రాయ్ ఎమర్సన్ సాధించిన 12 సింగిల్ టైటిల్స్ రికార్డును అధిగమించాడు. సిఎన్ఎన్ స్పోర్ట్స్ చానల్ ఈ శతాబ్దపు మేటి టెన్నిస్ ఆటగాడిని ఎంపిక చేయడానికి నిర్వహించిన ఓటింగ్‌లో ఎక్కువ ఓట్లు తెచ్చుకోగలిగాడు. ప్రస్తుతం సంప్రాస్ వయసు 32 సంవత్సరాలు. 1988 నుంచి ప్రొఫెషనల్‌గా మారిన పీట్ క్రీడాకారుడి కుండే 15 సంవత్సరాల కెరీర్ సమయాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే ప్రస్తుతం వరుస పరాజయాలు అతని క్రేజ్‌పై నీలినీడలను ప్రసరింపచేస్తున్నాయి. అందువల్లే రిటైర్ అవడం మంచిదని అందరూ సలహా ఇస్తున్నారు. మీద పడిపోతున్న వయసును ఛాలెంజ్ చేయడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. ఎంత వరకు సఫలమౌతాడో చూడాల్సిందే. యువ క్రీడాకారులు ప్రభంజనంలా దూసుకువస్తున్న తరుణంలో తన పూర్వ వైభవాన్ని నిలబెట్టుకోవడం సంప్రాస్‌కే కాదు ఎవరికైనా కష్టమే. అతని భవిష్యత్ ఎలా ఉంటుందో కాలమే చెప్పాలి. ◆



✻ శిరంశెట్టి కాంతారావు

సిండికేట్



కురుక్షేత్రంలో యుద్ధభేరీలా ఫ్యాక్టరీ సైరన్ భూంకరిస్తూ మోగింది. వర్షాకాలంలో తూనీగల్లా రకరకాల రంగుల డ్రస్సుల్లో కార్మికులు, ఉద్యోగులు, అధికారులు గోలగోలగా తుఫాన్ ఏదో రాబోతున్నంత హడావిడిగా కార్లల్లో, స్కూటర్ల మీద, సైకిళ్ళ పైనా పరుగులు పెడుతూ తమ తమ ఇండ్లకేసి పోసాగారు.

పాపం కుటుంబరావు ఒక్కడే ప్రపంచంలో దుఃఖమంతా తానొక్కడే మోస్తున్నంత దిగులుగా ఏదో తెలియని ఆందోళన ముఖంలో ప్రతిఫలిస్తుండగా చుట్టూ ఉన్న పరిసరాలలో ఏం జరుగుతుందో పట్టించుకోనంత పరధ్యానంగానూ, గూట్లో నుండి బయటికి వెళితే పిల్లులు మింగేస్తాయని భయపడే కోడిపిల్లలా ఫ్యాక్టరీ గూట్లోనే ఉండిపోతే బాగుండన్నంత దిగులుతో అడుగులో అడుగు వేసుకొంటూ మెల్లగా బయటికి వస్తూ ఏదో ఆలోచనల్లో పడ్డాడు.

కుటుంబరావు పేరును సార్థకం చేస్తూ నలుగురు పిల్లలకు తండ్రయ్యాడు. నడికారులో పడ్డాడు.

ఇద్దరాడపిల్లలు పెళ్ళీడుకొచ్చారు. మగపిల్లలిద్దరూ చదువులబ్బక ఒకడు చిరంజీవి యువసేనకు, మరొకడు బాలకృష్ణ యువసేనకు నాయకులై క్షణం తీరిక లేకుండా సినిమా సేవ చేస్తున్నారు.

ఇంకా ముసలి తల్లిదండ్రులు.

బావమర్దులు లేకపోవడంతో మిగిలి వున్న అత్త.

ఇంత పెద్ద సాగరాన్ని దాటే నావకు మరో సారంగు భార్య సంతానం ఉరఫ్ సంతాన లక్ష్మి. ఇదీ కుటుంబరావు పరివారం.

సుమారు పాతికేళ్ళ కిందట మీసకట్టు నల్లబడే రోజుల్లో నాన్న జీతముండే మునసబ్ గారి రికమెండేషన్‌తో అప్పుడే పునాదులు లేస్తున్న ఫ్యాక్టరీలో మజ్దూర్‌గా చేరి నానా చాకిరీ చేసి ఎట్లాగైతేనేం పర్మినెంట్ ఉద్యోగం సంపాదించాడు కుటుంబరావు.

"క్రీచ్‌మంటూ సడన్ బ్రేకుతో తనను తాకుతూ ఆగిపోయిన మోటార్ సైకిల్ శబ్దానికి ఉలిక్కి పడుతూ వాస్తవంల్లోకి వచ్చాడు.

"ఏందన్నా? కుటుంబరావన్నా!

అంత పరధ్యానంగా నడిరోడ్డు మీద నడుస్తున్నావ్?!

నేనంత దూరం నుండి హారన్ కొట్టుకుంటూ వస్తున్నా ఇనిపించుకోకుండా అట్లనే రోడ్డుకడ్డంబడి వస్తుంటివి! ఇంకా నయం సడన్ బ్రేకులు పడ్డాయి. లేకపోతే గుద్దేసే వాణ్ణే" అంటూ ఫిట్టర్ గుర్నాథం కుటుంబరావును మెత్తమెత్తగా వత్తాడు.

"అబ్బే, ఏదో ఆలోచనల్లో పడ్డాను గుర్నాథం" అంటూ తడబడుతూ సంజాయిషీగా అన్నాడు కుటుంబరావు.

"సర్లే పదా!" అంటూ గుర్నాథం వెళ్ళిపోయాడు.

కుటుంబరావు మెల్లగా సైకిల్ స్టాండులో ఉన్న సైకిల్ బయటికి తీసి నడిపించుకుంటూ ఇంటిదారి పట్టాడు.

కాని మనిషి మాత్రం మళ్ళీ ఏదో ఆలోచనల్లో మునిగిపొయ్యాడు. మొన్నటి సంఘటన పదే పదే కళ్ళ ముందు సినిమా రీళ్ళలా తిరుగుతూ కన్పించసాగింది.

✻ ✻ ✻

కుటుంబరావు పని చేస్తున్న ఫ్యాక్టరీలో సవాలక్ష యూనియన్లున్నాయి. వాటిల్లో ఒక దానిలో కుటుంబరావు కూడా ఒక సభ్యుడే.

ఆ యూనియన్ ప్రెసిడెంట్ ఫ్యాక్టరీలోనే నాయకుడు కాదు.

ఆ యూనియన్ అనుబంధం చేయబడిన రాజకీయ పార్టీలో కూడా ముఖ్య నాయకుడే.

ఆయన చేయని పైరవీ అంటూ ఉండదు. ఎవరు ఏ పని కావాలన్నా స్వంత పనిలా భావించి చేస్తుంటాడు. కాకపోతే అతని ఖర్చులు భరించడమే కుటుంబరావు లాంటి మామూలు మజ్దూర్లకు తలకు మించిన భారం.

కుటుంబరావు ఫ్యాక్టరీ కాలనీలోని ఓ రెండు గదుల క్వార్టర్లో పుష్పక విమానంలా ఇంతమంది కుటుంబ సభ్యులతో ఎట్లోగట్లా నెట్టుకొస్తూనే ఉన్నాడు.

ఒక రోజు పిడుగు పడ్డట్టుగా కుటుంబరావు ఇంట్లో ఊడిపడ్డాడు వాళ్ళ యూనియన్ ప్రెసిడెంట్.

వస్తూ, వస్తూనే

"ఇదుగో కుటుంబరావ్, నువు గూడా ఇను చెల్లెమ్మా!

ఏదో ఇన్నేళ్ళనుండి మనం మనం ఒక్క యూనియన్‌లో ఉంటిమి. మంచీ చెడూ కల్సి పంచుకుంటిమి. అందుకే మీకో విషయం చెబుదామని అవతల అర్జంట్ పని ఉన్నా వదులుకొని మీఇంటికొచ్చిన" అంటూ ఏదో మహాకార్యానికి ముందు నాందీ ప్రస్తావనలా మొదలు పెట్టి భార్యభర్తల వైపు చూశాడు.

"ఏమిటో చెప్పండన్నయ్యగారూ! మీకంటే ఈ ఊళ్ళో మాకింకెవరున్నారు?

"అదే గదమ్మా నేనూ అంటా! నాకు నువ్వొకటీ, నా చెల్లెలొకటీనా?! విషయం ఏమిటంటే టౌన్ చివర నాలుగెకరాల స్థలం కొని ప్లాట్లు చేస్తున్నాం. దాన్లో మనోళ్ళందరూ తలా ఒక ప్లాటు తీసుకుంటున్నారు. మీరూ పిల్లా, జెల్లా నలుగురున్న వాళ్ళయ్యె. ఈ రెండు గదుల ఇంట్లో 'కూరాకుల్లాగా' ఎంతకాలం ఒదిగి మెదిగి బతుకుతారు.

అందుకే మీరు ఒక ప్లాటు తీసుకొంటే బాగుంటుందని చెప్పడానికి వచ్చాను అంటూ చల్లకొచ్చి ముంతదాయకుండానే చెప్పాడు యూనియన్ ప్రెసిడెంట్.

"అవెమ్మా! ప్లాట్ తీసుకొనేంత డబ్బు నాదగ్గరెక్కడిదన్నా. ఎప్పటికప్పుడు ఇంటిఖర్చులకే నీలాటి వాళ్ళ దగ్గర అప్పు సప్పు చెయ్యాల్సొస్తుంది." అంటూ కుటుంబరావు ఆ ప్రతిపాదనను మొదట్లోనే కొట్టిపారేశాడు.

"మరి నువ్వేమంటావ్" అన్నట్టుగా ప్రెసిడెంట్ సంతానం వైపు చూశాడు.

"ఆయనెప్పుడూ అంతే అన్నయ్యగారూ! ఏదీ పట్టించుకోడు. పిల్లలు పెరుగుతున్నారు. ఇంట్లో ముగ్గురు పెద్ద మనుషులు. ఈ అగ్గిపెట్టెంత ఇంట్లో ఎన్ని అవస్థలు పడుతున్నానో ఆ దేవుడికే తెలుసు" అంటూ సంతానం మొగుడికి ఏమీ పట్టదన్నట్లు మాట్లాడుతూ చీరకొంగుతో కళ్ళొత్తుకుంది.

"అరరే ఏడ్వకు చెల్లెమ్మా! ఆయన మాత్రం ఏం

జేస్తాడు! ఇంట్లో ఖర్చు పెద్దదాయె.

అయినా మీరు ఆలోచించి "ఊం అంటే ఏదో ఒక ఏర్పాటు చేద్దాం" అంటూ ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాడు యూనియన్ ప్రెసిడెంట్.

"ఏం జేస్తమన్నా! చెయ్యడానికేముంది!"

"అరే! అట్లంటే ఎట్లా బ్రదర్, నీ పి.ఎఫ్. తియ్యి ఇప్పటి దాకా నాకు తెల్సి నువ్వు ఎప్పుడూ తియ్యలేదు గదా. అది చాలకపోతే చూద్దాం".

"ఇద్దరాడపిల్లలున్నరన్నా. ఆ డబ్బులు వాళ్ళ కోసమని ఎంత కష్టమొచ్చినా తియ్యట్లేదు."

"అరే! పిచ్చోడా, ఈ ప్లాట్ మాత్రం వాళ్ళకు కాదా? ఇవ్వాల రూపాయి పెట్టి కొన్నది రేపు పది రూపాయలకు పోవచ్చు గదా"

అంటూ మొత్తానికి సంతానం ద్వారా కుటుంబరావును ఒప్పించి పి.ఎఫ్.లో వున్న లక్షరూపాయలు తీయించి ప్లాట్ కొనిపించాడు యూనియన్ ప్రెసిడెంట్.

ఇటువంటి కుటుంబరావుల ద్వారా ప్రెసిడెంట్ లక్షలు సంపాదించాడు.

ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం పాతికవేలు కావాల్సి వచ్చింది. కానీ, ఎక్కడా దొరక్క కుటుంబరావు నానా అవస్థలు పడుతున్నాడు.

ఒక రోజు

"ఏంటిది?! కుటుంబరావు! నీ ఒక్కడి కోసం అందరి ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఆగిపొయ్యాయి. పాతికవేలు పుట్టించలేనోడివి రేపు కొంపెట్లాకడతావ్!" అంటూ ప్రెసిడెంట్ ఇంతకుముందు తెచ్చి పెట్టుకున్న శాంతస్వభావం పోయి అసలు స్వభావంతో కఠినంగా మాట్లాడసాగాడు.

"ఏంజేయాలన్నా! అక్కడికీ తెల్సినోళ్ళందరినీ అడిగాను. ఎవ్వరూ పుట్టనియ్యలేదు. నాకింతకుముందు ఎవ్వరి దగ్గరా అప్పు తీసుకోవడం తెలియదు. ఉన్నదాంట్లోనే మునగానాం, తేలానాం అన్నట్టుగా నెట్టుకొస్తున్నా" అంటూ కుటుంబరావు అప్పు చేయటంలో తన అసమర్థతను నిజాయితీగానే ఒప్పుకున్నాడు.

"అప్పులు చెయ్యటం ఎవరికైనా సర్దానా ఏమిటి! అవసరం వచ్చినప్పుడు ఏదో విధంగా డబ్బులు పుట్టించుకోవాలి. పనులు జరుపుకోవాలిగాని, ఇంతకుముందు అస్సలు చెయ్యలేదు కాబట్టి, నాకెవ్వరూ ఇవ్వటం లేదంటే, మరి ఈ పనెట్లా గడవాల! నీ ఒక్కడి కోసం మిగతా అందరివీ ఆగిపోతున్నాయి కదా!

ఎవరికేదైనా నా నెత్తిమీద ఈ లీడర్ గిరీ ఒకటుంది కదా! మరినాకు తప్పుద్దా? ఆ అకౌంటెంట్ సుబ్బారావు దగ్గర డబ్బులున్నాయి. ఈ మధ్యనే వాళ్ళ ఊళ్ళో పొలం అమ్ముకొచ్చాడు. రేపోసారి ఫ్యాక్టరీ కొచ్చాక కలువు నే చెబుతా. వడ్డీ కూడా కొంచెం తీసుకొమ్మని. రేపు జనవరిలో ఎన్‌క్యాష్‌మెంట్ వచ్చాక ఇద్దామని చెబుదాం? అంటూ ప్రెసిడెంట్ అప్పు ఎప్పుడు, ఎలా చేయాలో హితోపదేశం చేశాడు.

జీవితంలో మొదటిసారి పాతికవేలు అప్పు చేయడానికి కుటుంబరావు సిద్ధమయ్యాడు.

తను నమ్మిన నాయకుడే తన స్వార్థ కోసం అప్పుల ఊబిలోకి నమ్మకంగా దించాడు.

* * *

ఫ్యాక్టరీలో..

"ఇదుగో సుబ్బారావు ఈ కుటుంబరావుకి అర్జంట్‌గా ఓ పాతికవేలు కావాల. నీ దగ్గరుంటే ఇవ్వు. నాది బాధ్యత. వడ్డీ మాత్రం చూసి తీసుకో మనోడే కదా!" చెప్పాడు ప్రెసిడెంట్.

"అన్నా! నువ్వు చెబుతున్నావు కాబట్టి తప్పదుగా మరి. ఇస్తాలే గాని వడ్డీ మాత్రం ఐదు. జీతం తీసుకోగానే నెల నెలా ఇవ్వాలి."

"అరే మనోడే గురూ! మరీ ఐదేంది! కొంచెం తగ్గించు."

"లేదన్నా! అదీ నువ్వు చెబుతున్నావు కాబట్టి. ఇప్పుడసలు నా దగ్గర డబ్బులు కూడా లెవ్వు. నీ మాట కాదనలేక ఎక్కడన్నా ఏర్పాటు చెయ్యాలి."

"సరే కానియ్యి. నేను చెప్పినా కాదంటే ఇక చేసేదేముంది?!

"ఏమిటి? కుటుంబరావు! ఏం మాట్లాడవ్." అంటూ ప్రెసిడెంట్ కుటుంబరావు వంక చూశాడు.

"సరే కానియన్నా."

"మరి కుటుంబరావును ఎప్పుడు కలువమంటావ్" అంటూ ప్రెసిడెంట్ సుబ్బారావు వంక చూశాడు.

"ఎక్కడ కేందన్నా! సాయంత్రం 'స్వప్నలోకం'బారు దగ్గరకు రమ్మను.

కుటుంబరావు మావులో పడ్డ చేపలాగా బయటికి వచ్చే దారిలేక చచ్చినట్టు సాయంకాలం 'స్వప్నలోకం'లో మొదటిసారి కాలు పెట్టాడు.

అంతకుముందే వచ్చి కూర్చున్న ప్రెసిడెంట్, సుబ్బారావు ఎరకోసం పొంచి వున్న గద్దల్లా కుటుంబరావు కోసం ఎదురు చూస్తున్నారు.

"రా! రా! ఇటు, ఇటు కుటుంబరావు.

"ఏమిటి తత్తర, బిత్తర పడుతున్నావు"

"ఓహో! నీకు ఇటువంటి చోటికి రావటం కొత్తకదూ! అందుకే నిజంగానే 'సప్నలోకం'లోకి వచ్చినట్టు ఫీలవుతున్నావు. అవునా?" అంటూ ప్రెసిడెంట్ కుటుంబరావును పలకరించాడు.

కుటుంబరావు బిక్కు బిక్కుమంటూ వాళ్ళదగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. కుటుంబరావుకు కూల్‌డ్రింకు, వాళ్ళకో ఫుల్‌బాటిల్, చికెన్ పకోడి టేబిల్ మీది కొచ్చివాలాయి.

రాత్రి పదిగంటలకు స్వప్నలోకంలో నుండి ముగ్గురూ బయటకొస్తూ...

"ఆ కుటుంబరావు ఇందాక నీకిచ్చిన డబ్బుల్లోంచి బిల్లు కట్టు మరి" అంటూ ప్రెసిడెంట్ ముద్ద, ముద్దగా మాట్లాడుతూ కుటుంబరావుకు ఆర్డరేశాడు.

అలవాటు లేని ఆ పరిసరాలలో రకరకాల వాసనలకు తల తిరుగుతున్నట్లు అన్పిస్తుంటే కళ్ళు తేలవేస్తూ సుబ్బారావు ఇచ్చిన పాతికవేలల్లో నుండి ఐదువందలు బిల్లు కట్టి బ్రతుకు జీవుడా అంటూ కుటుంబరావు బయటపడ్డాడు.

అప్పులిచ్చే ప్రతివాడూ ఇలా అప్పు తీసుకొన్న వాడి నెత్తిన చేయివేస్తూ తాగటం, తినటం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది.

మొత్తం మీద అతి ప్రయాసతో సంతానం పేర ప్లాట్ రిజిస్ట్రేషన్ అయ్యింది.

కొన్నాళ్ళ తరువాత

"ఏవండీ! మన ప్లాట్లల్లో హౌసింగ్ బోర్డు లోన్లు తీసుకొని మన కంపెనీలో చాలా మంది ఇండ్లు కట్టుకుంటున్నారట కదా! మనం కూడా అట్లానే కట్టుకుందామండీ. ఈ ఇరుకు కొంపలో మెసలలేక ఛస్తున్నాం. నెలనెలా కొంత కడితే బాకీ తీరుద్ది. ఆ యూనియన్ అన్నయ్యగార్ని అడగండీ" అంటూ సంతానం మళ్ళీ కుటుంబరావు ముందు ఓ కొత్త ఆలోచన బయట పెట్టింది.

"ఛత్! నీకేమన్నా బుద్ధుందా?! ఇప్పుడు తీసుకొన్న వాటికే వడ్డీలు కట్టలేక చస్తున్నా. పి.ఎఫ్.లోను కటింగ్‌పోను వచ్చే జీతం చాలక నెల నెల దొరికిన కాడ దొరికినట్టు చే బదుళ్ళు చెయ్యలేక చస్తున్నా" అంటూ కుటుంబరావు సంతానం మీద కస్సున లేచాడు.

"ఇప్పుడా పిల్ల ఏమందిరా?! అందరూ కట్టుకుంటున్నట్టే మనం ఓ ఇల్లు కట్టుకుందాం అంది. అందులో తప్పేంది? దాని మీద లేస్తున్నావ్!" అంటూ ఎప్పుడూ మంచంలోనే ఉండే కుటుంబరావు తండ్రి కోడల్ని వెనకేసుకొచ్చాడు.

"ఎవ్వరి తప్పూ లేదు. తప్పంతా నాదే" అంటూ కుటుంబరావు విసవిసా బయటికి వెళ్ళిపోయాడు.

"ఏమిటి? కుటుంబరావు ఎక్కడికో స్పీడ్ మీద పోతున్నావ్" అంటూ పలకరించాడు పక్క క్వార్టర్‌లో కాపురముండే ముత్యాలరావు.

"నా బొంద నెనెక్కడికి పోతాను. ఏదో ఇంట్లో చికాకు పడలేక అలా బయటికి పోతున్నా."

"ఏంటి కథ" ఆరా తీస్తున్నట్టుగా అడిగాడు ముత్యాలరావు.

కొంతమందికి ఇతరుల విషయాల్లో తల దూర్చడమన్నా, ఇతరులు ఇబ్బందుల్లో ఉంటే చూస్తూ వినోదించడమన్నా మహా సరదా. సరిగ్గా అలాంటి వాడే ముత్యాలరావు.

కుటుంబరావు సోదంతా విన్న ముత్యాలరావు "హే! దీనికింత ఆలోచనేంది గురూ! మా బామ్మర్ది హౌజింగ్ బోర్డులో వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్నాడు. రేప్పొద్దున వాళ్ళింటికి పోదాం. నీ పని క్షణాల్లో అవుతుంది సరేనా. అయినా మీ ఆడవాళ్ళు అన్నదాంట్లో తప్పేముంది గురూ! పెద్ద కుటుంబం కదా, సొంతిల్లుంటే బాగుంటుందని వాళ్ళ ఆశ. అంతేగదా" అంటూ కుటుంబరావు సమస్యకు చిటికలో పరిష్కారం చూపించినట్టు గర్వంగా కుటుంబరావుకేసి ఓ చూపు విసిరాడు.

"ఏంటి ముత్యాలరావు! నువ్వు కూడా అట్లానే మాట్లాడుతావు. ఇంకా ప్లాట్ కొన్న అప్పే తీరలేదు. ఇప్పుడు ఇల్లు కట్టడమంటే పిల్లల పరాచికమా?!"

"ఏమో గురూ! నాకు తోచింది చెప్పాను. నీ ఇష్టం"

కుటుంబరావు ఎంతమొత్తుకున్నా ఫలితం లేక చివరికి ఓ శుభముహూర్తాన ముత్యాలరావు బామ్మర్ది సహాయంతో హౌజింగ్ లోనుకు సంతానం చేత దరఖాస్తు పెట్టించాడు.

కుటుంబరావు ఖర్మకాలి లోను కూడా వెంటనే శాంక్షన్ అయ్యింది. దాంతో ఓ మంచిరోజు ఇంటికి శంకుస్థాపన జరిగి ఇంటి పనులు చకచకా జరుగుతున్నాయి. కాని అసలు చిక్కు ఇక్కడే వచ్చింది.

హౌజింగ్ వాళ్ళు ఇచ్చిన లోనుతో ఇల్లు స్లాబ్ లెవెల్ కొచ్చి ఆగిపోయింది. ఆ తర్వాత పనికోసం ఫ్యాక్టరీలో రకరకాల లోన్ల కోసం అప్లయి చేసినా ఏ ఒక్కటీ చేతికి రాలేదు. దాంతో పని మధ్యలో ఆగిపోయి, డబ్బులన్నీ బ్లాక్ అయిపొయ్యాయి అనే బాధ, ఏం చేయాలో తోచక కుటుంబరావు కుదేలైపోయాడు.

* * *

"కుటుంబరావు! ఇంతకాడికొచ్చాక ఇంక

(మిగతా 23వ పేజీలో)

తెలంగాణ చారిత్రక నవల 'కాలరేఖలు'

ఉపాధ్యాయ ఉద్యమంలో ఉండినప్పటి నుంచి నాకు నవీన్‌తోను, అతని నవలా సాహిత్యంతోను గాఢ పరిచయం ఉంది. అంపశయ్య, ముళ్ళపొదలు, అంతస్రవంతి, ఉమెన్స్ కాలేజి, ప్రత్యూష మొదలగు అతని చాలా నవలలు విద్యాసంబంధమైన అనేక అంశాలను లోతుగా చర్చించాయి. అనవసర విషయాల గూర్చి, అశ్లీలాన్ని గూర్చి, అభూతకల్పనల గూర్చి నవీన్ తన కలాన్ని ఉపయోగించలేదు. సాహిత్య సృష్టిని సంపాదన కోసం గాకుండా సామాజిక బాధ్యతగా నిర్వర్తించిన వాడు నవీన్. సమస్యల నుంచి తప్పుకోమని గాక వాటిని తట్టుకోమనే శక్తినిస్తాయి అతని నవలలు.

గత 50 ఏళ్ళుగా తెలంగాణా జీవితంలో వచ్చిన మార్పును, అందుకు ప్రేరణగా నిలిచిన ఉద్యమాలను, ప్రభావితం చేసిన పరిస్థితులను బేరీజు వేస్తూ ఇటీవల నవీన్ 'కాలరేఖలు' పేరుతో చారిత్రాత్మక నవలను వెలువరించాడు. 1944-1956 మధ్యకాలంలో తెలంగాణాలో చోటు చేసుకున్న పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ ఈ నవల రాశాడు. 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు హాజరైన కార్యకర్తల్లో నేనూ ఒకణ్ణి కనుక ఆ పరిస్థితులతో, పరిణామాలతో నాకూ సంబంధం ఉంది. సాంస్కృతిక పరమైన మార్పునే గాకుండా సమగ్రమైన పరివర్తన కోరుతూ సమరం వైపు ఉద్యమం టర్న్ తీసుకున్న సందర్భం అది. నిజాం నిరంకుశ వ్యవస్థ, ఫ్యూడల్ శక్తుల దాష్టీకం – వాటి వికృత స్వరూపం – ప్రజల్ని ఏ విధంగా హింసించిందో – అలాంటి హింసకు గురైన కుటుంబం నాది. నా జీవితానిది. అందుకే ఈ నవల చదువుతున్నప్పుడు ఆయా పాత్రల్లో తన్మయం చెందాను. ఏ జనగామ ప్రాంతమైతే దోపిడీకి అధికంగా గురైందో అదే జనగామ ప్రాంతం నుండి వర్గశత్రువుల్ని మట్టుబెట్టడానికి 'ప్రజావిప్లవం' బయలుదేరింది. ఆ ప్రజాపోరులో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను. 'కాలరేఖలు' నవలలో నవీన్ తీసుకున్న పాత్రలు గాని, పరిస్థితులుగాని, పరిసరాలు గాని ఇవన్నీ మావే కాబట్టి మమేకం చెందకుండా ఉండలేకపోతున్నాను.

ఆ రోజుల్లో దళాలు గ్రామాల్లోకి రాగానే విప్లవ గీతాలను పాడుతూ రావి నారాయణరెడ్డికి ఆరుట్ల రాంచంద్రారెడ్డికి, మగ్దూంకు జేకొడుతుండే వారు. ప్రజలందరిని సమీకరించి నిజాముకు, దొరల పీడనకు వ్యతిరేకంగా పోరాడవలసిన ఆవశ్యకతను గూర్చి, అవసరాన్ని గూర్చి నూరిపోసేవారు. ప్రజాద్రోహులైన వారికి అక్కడికక్కడే బుద్ధి చెప్పేవారు. ప్రజాద్రోహుల్ని చంపాలనుకున్నప్పుడు మాత్రం పార్టీ ఎంతో చర్చించిన తర్వాతనే 'అంతిమంగా' ఆ నిర్ణయాన్ని తీసుకునేది. 'వ్యక్తిగత' హింసకు అందులో తావులేదు. ఉమ్మడి నిర్ణయం, ఉమ్మడి కార్యాచరణ మాత్రమే ఉండేవి.



కాలరేఖలు
రచయిత : నవీన్; వెల : రు. 180/-; **ప్రతులకు :** నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ క్రాస్ రోడ్స్, ఆర్యసమాజ్ మందిర్ ఎదురుగా, హైదరాబాద్

'కాలరేఖలు' నవలలో నవీన్ ఉద్యమాలనే కాక పలు సామాజిక పరిస్థితుల్ని, అంతరాల్ని గూర్చి పేర్కొన్నాడు. ఏదైనా కావాలని పిల్లవాడు మారాంజేస్తే 'నువ్వేమన్న దొరకొడుకివా?" అని తల్లిదండ్రులు అంటుండేవారు. అదే విధంగా 'నువ్వేమన్న పోలీసు పటేలు మనవనివా?" అంటుంది పార్వతమ్మ. అంటే ఇక్కడ చదువు, సౌకర్యం ఉన్నోళ్ళకేగాని లేనోళ్ళకుగాదని పరోక్షంగా వారి అభిప్రాయం అన్నమాట. లేత మనసుల్లో ఆనాడు ఎన్ని విషబీజాలు పడ్డాయో ఆలోచించండి.

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని వివరించే సాహిత్యం ఇప్పటికే ఎంతో వచ్చింది. అయితే సాయుధ పోరాట నేపథ్యాన్ని, తదనంతర పరిణామాలను సమగ్రంగా చిత్రించిన నవల కాలరేఖలు. 1944-1956 ఈ పన్నెండు సంవత్సరాల కాలం తక్కువే కావచ్చు. కాని చరిత్రను మలుపు తిప్పిన సంఘటనలు ఇక్కడే చోటు చేసుకున్నాయి. వాటన్నింటిని శాస్త్రీయంగా, సమగ్రంగా చర్చించి చారిత్రక నవల కాలరేఖలు.

సైన్స్, సామాజిక శాస్త్రాల అధ్యయనం సమాంతరంగా సాగినప్పుడే సమసమాజాభివృద్ధి సాధ్యమవుతుంది. దురదృష్టవశాత్తు ఈనాడు సమాజంలో చదువంటే సైన్స్, లెక్కలు అనే భ్రమ పెరిగింది. సామాజిక స్పృహ, సామాజిక కోణం లేని సైన్స్ వికాసం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు. సైన్స్ పరిశోధనా ఫలితాలు సమాజానికి అందాలంటే సామాజిక శాస్త్రాల అధ్యయనం తప్పనిసరి. ఇప్పటికైనా పంథాను మార్చుకోవలసి ఉంది. శాస్త్రవేత్తలు ఎంత అవసరమో ఆర్థిక శాస్త్రవేత్త, చరిత్రకారులు, కళాకారులు, రచయితలు కవులు అంతే అవసరం. ప్రపంచ విప్లవ పోరాటాల్లో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని, తదనంతర పరిణామాలను ఇప్పటి తరానికి తెలియబరచేందుకు నవీన్ చేస్తున్న ప్రయత్నం సార్థకమైనది – సాహసవంతమైనది. ఆస్కార్‌వైల్డు అన్నట్లు "ఎవ్వరైనా చరిత్రను సృష్టించవచ్చు. కాని గొప్పవాడు మాత్రమే దానిని రచించగలరు" ఈ సందర్భంగా నవీన్‌కు నా శుభాకాంక్షలు.

- చుక్కా రామయ్య

శ్రీకారం

పరిమళం (కవితా సంపుటి)
రచయిత : యస్. యస్. రెడ్డి; వెల : రు. 30/-; **ప్రతులకు :** శ్రీమతి సుతారి రూపా, ఇ.నెం. ఎఫ్-6, 2-2-1149/1, తిరుమల ఎన్‌క్లేవ్, న్యూనల్లకుంట, హైదరాబాద్.

దేవుళ్ళ తీరు మనుషుల జోరు
రచయిత : చింతపెంట కమల; వెల : రు. 30/-; **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.



పరిపూర్ణ మానవుడు - మార్క్స్ స్వప్నం
తెలుగు అనువాదం : శ్రీ వత్స; వెల : రు. 5/-; **ప్రతులకు :** లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, ఇ.నెం. 5-85-4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు.

* గంగాధర్ వీర్ల

ఆరు సంవత్సరాల క్రితం మాట..అంటే **1996** సంవత్సరం నవంబర్ **22**న పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన కుర్రాడు ఉద్యోగాన్వేషణ నిమిత్తం శ్రీకాకుళం జిల్లా నుంచి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో భాగ్యనగరం చేరుకున్నాడు. తన లక్ష్యం వేరైనా తప్పని పరిస్థితుల్లో చిరుద్యోగంలో ఎకౌంటెంట్‌గా చేరాడు. ఉద్యోగంలో ఇమడలేని అతని కళాపిపాసకు రెక్కలు వచ్చాయేమో..! స్వేచ్ఛగా 'ఘంటసాల పాట' కోసం పయనమయ్యాడు. రెండు మూడేళ్లలోనే వేలాదిమంది సంగీతప్రియుల ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. ఆయనే మన మాస్టర్ శరత్‌శ్చంద్ర. ఘంటసాల పాటల వ్యాప్తికి విశేషకృషి జరుపుతూ రాష్ట్రవ్యాపిత గానవిభావరులతో అశేషప్రేక్షకుల మన్ననలను అందుకుంటున్న ఘంటసాల స్వరపరిశోధకులు, స్వరనిధి వ్యవస్థాపకులు శరత్‌శ్చంద్ర గురించి మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

ఘంటసాల పాటలే పాడతా : శరత్‌శ్చంద్ర

మీ బాల్యం, సంగీత పరిచయం గురించి చెప్పండి?

జన్మస్థలం శ్రీకాకుళం జిల్లా గారమండలంలోని లంకపేట గ్రామం. మాది సంగీత కుటుంబమే. నాన్నగారైన తామడ బ్రహ్మంగారు పౌరాణిక నాటకాల్లో బాగా అనుభవమున్నవారు. హరిశ్చంద్ర, అర్జునుడులాంటి ఉదాత్తమైన పాత్రలు పోషించడమేకాక హార్మోనిస్టుగా, దర్శకునిగా పలు నాటకాలకు పనిచేశారు. ఈ నేపథ్యంలో పదవ ఏటనే నేను మానాన్నగారి దగ్గరే హార్మోనిస్ట్‌గా శిక్షణ ప్రారంభించాను. క్రమేణా తండ్రి నటించిన పాత్రలకే హార్మోనియం సహకారం అందించగలిగేలా సంగీత పరిజ్ఞానాన్ని అలవర్చుకున్నాను. నటునిగా, దర్శకునిగా, సంగీత పర్యవేక్షకునిగా నాటకరంగంలో ఎనిమిదేళ్లపాటు కృషిచేశాను.

మరి ఘంటసాల పాటగాడిగా ఎలా మారారు?

చీకూరులో పదవతరగతి చదివే సమయంలో మాతెలుగు మాష్టారు పద్య పఠనంలోని ఉచ్చారణ, లయను పసిగట్టి నాకు తెలియకుండానే నాపేరును పాటల పోటీలకు పంపి 'బ్రతుకు తెరువు' చిత్రంలోని ఘంటసాలగారి 'అందమె ఆనందం' అన్న పాటను పాడించారు. ప్రథమ బహుమతి వచ్చింది. సినిమా పాటకు ఇంత ఆదరణవుంటుందా అన్న విషయాన్ని గ్రహించి అప్పటినుండి ఘంటసాలగారి పాటలను సాధన చేయడం ప్రారంభించాను. ఆ సమయంలో నా సోదర సమానులు నాగేశ్వరరావుగారి ప్రోత్సాహం మెండుగా ఉండేది. శ్రీకాకుళం పట్టణంలోని రామకృష్ణ, ఆంజనేయ థియేటర్లలో ప్రదర్శించే ఎన్టీఆర్, ఏఎన్ఆర్ సినిమాలను పది, ఇరవైసార్లు చూపించేవారు. ఘంటసాల పాటల్లోని గళ వైవిధ్యాన్ని పరిశీలించడానికి సహకరించేవారు. పిజి పూర్తయిన తర్వాత కూర్మారం గ్రామంలో విజయ్ అర్కెస్ట్రా అనే పేరుతో సొంతగా ఆర్కెస్ట్రా బృందం ఏర్పడి విభావరులు నిర్వహించేవాళ్లం. భాగ్యనగరంలో ప్రముఖ కళాకారునిగా ఎదగడానికి

వెనుకవున్న కారణాలు వివరిస్తారా ?

ఎక్కడో మారుమూల గ్రామంలోనే మరుగున పడిపోకుండా రాష్ట్రవ్యాపిత కళాకారులకు పరిచయం కావాలనే సదుద్దేశంతో తిరుమల కూర్మాచారి కుటుంబ సభ్యులు నన్ను బలవంతంగా(నవ్వుతూ) భాగ్యనగరానికి పంపారు. మొదట్లో స్నేహితుడి రూమ్‌లో ఉంటూ నన్ను నేను పోషించుకోవడానికి ఒక ప్రైవేట్ కంపెనీలో ఎకౌంటెంట్‌గా చేరాను. 96 సంవత్సరం డిసెంబర్‌లో 'స్వరసుధ'వారి ఘంటసాల పాటల పోటీ ప్రకటన నాలోని కళాకారుణ్ణి తట్టిలేపింది. పాటల పోటీలో పాల్గొని 'ఈ నల్లని రాలలో' పాటకు ద్వితీయ బహుమతిని దక్కించుకున్నాను. అక్కడే పరిచయమైన సావేరి సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు భవానీగారి ప్రోత్సాహంతో రవీంద్రభారతి వేదికపై సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో 'అమ్మా అని అరచినా', 'శివశంకరీ' పాటల్ని పాడాను. ఆ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కోరమండల్ సిమెంట్ గ్రూప్ అధినేత లక్ష్మీమోహన్ పరిచయ భాగ్యంతో భాగ్యేశ్వరి సాంస్కృతిక సంస్థను 97సంవత్సరం, డిసెంబర్ 14న స్థాపించడం జరిగింది. పూర్తి సామర్థ్యంతో మొదటిసారిగా 'నేనుపాడతా' కార్యక్రమాన్ని డాక్టర్ సినారె, అక్కినేని సమక్షంలో త్యాగరాయగానసభలో నిర్వహించి సంగీతప్రియులందరికీ బాగా పరిచయమయ్యాను. ఈ క్రమంలో ఎందరో ఔత్సాహిక గాయకులు మాతో కలిసి వేదికలపైకి గాయకులుగా పరిచయమయ్యారు. మరికొందరు బృందాలుగా ఏర్పడి సొంతగా విభావరులు నిర్వహించుకొనే స్థాయికెదిగారు.

మీ స్వగ్రామమైన లంకపేటలో ఘంటసాలగారికి దేవాలయాన్ని నిర్మిస్తున్నారు కదా కారణం?

తండ్రి కోరికమేరకు 'ఘంటసాల స్వరార్చన' చేసి గుడి కట్టాలని సంకల్పన చేశాము. దేవాలయం నిర్మాణం కొనసాగుతుంది. మూడు ఎకరాల స్థలంలో, పుష్కరిణితో పాటు అందమైన పుణ్యక్షేత్రంగా ఈదేవాలయాన్ని తీర్చిదిద్దాలనే ప్రణాళికతో పనులు సాగిస్తున్నాము.

ఘంటసాల సంగీత కళాశాల పేరుతో పుస్తకాలను వెలువరిస్తున్నారు కదా దేనికోసం?

ఘంటసాల సంగీత పాఠశాలను నెలకొల్పే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. సిలబస్‌ను తయారు చేశాము. ఇప్పటివరకూ పన్నెండు సంపుటాలు ఆవిష్కరించాము. ఘంటసాల పాడిన శాస్త్రీయ, లలితగీతాలు, పద్యాలు, శ్లోకాలతోపాటు శాస్త్రీయ పద్ధతుల్లో సంగీత శిక్షణనివ్వడం ఈ పాఠశాల ముఖ్య ఉద్దేశం. అలాగే ప్రతిభవున్న పేద కళాకారులకు ఈ పాఠశాల అందుబాటులో ఉండాలన్నది మా సంకల్పం.

మీ మనసులోని మాట చెప్పండి?

స్వీయ రచన, సంగీత సంపత్తిగల ఘంటసాలను ఆంధ్రవాగ్గేయకారుడిగా గుర్తించి ప్రభుత్వం ఏదైనా మంచి కార్యక్రమానికి శ్రీకారంచుడితే నాతోపాటు ఎందరో ఘంటసాల అభిమానులు ఆనందిస్తారు. ఘంటసాలగారు పాడని హనుమాన్ చాలీసాను నలభైరాగాల్లో ఆయన గాత్ర శైలితో పాడాలనివుంది. సాధన జరుగుతోంది.

కోరిక?

నా గళం సజీవంగా ఉన్నంతవరకూ ఘంటసాల పాటల్నే పాడాలని. ◆

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ



పాడుపడిన చిన్న గది... నేలపై పరచిన బొంత. పక్కన చిన్న చెంబుతో మంచినీళ్ళు... పేదరికానికి ఆనవాళ్ళుగా ఉన్న అక్కడ గ్రంధి నగేష్ కూర్చున్నాడు.

నడవడానికి వాళ్ళు సహకరించడం లేదు. మాట్లాడటానికి నోరు రావడం లేదు.... ఏ పని చేయడానికైనా శరీరమే ముందుకు రావడం లేదు.

నిస్సహాయంగా జీవచ్ఛవంలా ఉన్నాడు.

అనుకున్న వారు... నా అనేవాళ్ళు ఎవరూ లేని ఒంటరి జీవితం మనస్సును కృంగదీస్తోంది.

వచ్చిన వారివైపు దీనంగా చూస్తుంటాడు.

సాయం కోసం అర్థిస్తుంటాడు.

చుట్టుపక్కల వారందరూ అభాగ్యుడని జాలి పడుతుంటారు. "ఇంతేలే కొందరి బతుకులు' అని సానుభూతి చూపిస్తుంటారు.

నగేష్ ఎప్పుడూ కిటికీ లోంచి చూస్తుంటాడు.

దూరంగా శంకరమఠం కనిపిస్తుంటుంది.

ఆ జంక్షన్‌లో నిరంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేసే కానిస్టేబుల్ కనిపిస్తుంటాడు. డ్యూటీలు మారుతున్న వారందరినీ జాగ్రత్తగా గమనిస్తుంటాడు.

"నాకే ఇలా ఎందుకయిందని!' మనసులో బాధ పడతాడు.... అందమైన గతంలోకి జారిపోతుంటాడు....

విశాఖపట్నంలో దొండపర్తి ప్రాంతానికి చెందిన గ్రంధి నగేష్ 1982లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శిక్షణా కాలంలో పరిచయం అయిన ముస్లిం మహిళా కానిస్టేబుల్‌ను ఇష్టపడి మతాంతర వివాహం చేసుకున్నాడు. వీరి పెళ్ళికి ఇరువురి వైపు పెద్దలు ఎవరూ అంగీకరించలేదు. అయినా ధైర్యంగా వేరే కాపురం పెట్టాడు. ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు.

ఆ రోజు 1992 జనవరి 18.

వన్‌టౌన్ దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధి నిర్వహణ చేస్తున్నాడు.

దురదృష్టం వెంటాడిన రోజు అది.

ముగ్గురు యువకులు ఒకే స్కూటర్ మీద ఎక్కి వస్తున్నారు. నగేష్‌కు బాధ్యత గుర్తుకు వచ్చింది.

వారిని అడ్డగించాడు.

పొగరుబోతులైన యువకులు స్కూటర్ ఆపలేదు సరికదా నగేష్‌ను ఢీకొట్టి పరారయ్యారు.

నగేష్ కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. కోమాలోకి వెళ్ళిపోయాడు.

రెండు రోజుల తర్వాత తెలివి వచ్చింది.

సంప్రదాయాలకు విలువనిచ్చే నగేష్ కుటుంబీకుల సహకారం కొరవడింది. భార్య ముందుకువచ్చింది. నగల్ని అమ్మింది.. ఆస్తుల్ని అమ్మింది.. వైద్య చికిత్స కోసం ఉన్నదంతా ఊడ్చి పెట్టింది. అయినప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు.

భార్యకు బదిలీ అయిపోవడం... ఆమె కుటుంబీకుల ఒత్తిడి కారణంగా పిల్లలతో సహా దూరం అయిపోయింది.

నగేష్ ఒంటరిగా మిగిలిపోయాడు.

బంధువులు ప్రేమ సమాజంలో ఉంచారు. మూడేళ్ళు వారు సపర్యలు చేశారు. పరిస్థితిలో మార్పు రాలేదు.

నగేష్ అక్క సమీపంలో చిన్న అద్దె గదిలో ఉంచింది. దగ్గరలో ఉన్న ఇంటి నుంచి వస్తూ సపర్యలు చేస్తోంది.

అప్పటి నుంచి గబ్బిలం బతుకైపోయింది.

* * *

నగేష్ శూన్యంలోకి చూస్తున్నాడు.

అతనికి ఎంతో అసహనంగా ఉంది.

"అంకుల్... అంకుల్..." అంటూ అప్పుడప్పుడు వచ్చి పలకరించే పక్కింటి పాప ప్రశాంతి రావడం లేదు.

'ఊరు వెళ్ళిందేమో?' అనుకున్నాడు.

దూరంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ విజిల్ వేస్తూ ఎవరినో అదిలిస్తున్నాడు. కిటికీలోంచి కనిపిస్తున్న ఆ దృశ్యం నగేష్‌ను ఎంతో ఆకట్టుకుంది.

అక్క తెచ్చిన క్యారేజ్ భోజనం చేసి చేతులు కడుక్కున్నాడు..

కాళ్ళతో జరుగుతూ వెళ్ళి దూరంగా ఉన్న పాత పేపరు తెచ్చుకుని అందులో అక్షరాలను కూడబలుక్కుని చదివాడు..

"అంకుల్ లంచ్ అయిపోయిందా?" ప్రశాంతి ఆ గదిలోకి వచ్చింది.

నగేష్ కళ్ళల్లో కోటి కాంతులు వెలిగాయి.

"రా.. అమ్మా..." మెల్లగా కూడబలుక్కుని పిలిచాడు...

ప్రశాంతి దగ్గరికి రాగానే "పలక..." పలక లేక పలకాడు నగేష్.

గోడకు ఆన్చి ఉన్న పలకను, బలపాన్నీ తెచ్చి అందించింది... నగేష్ మాట్లాడటానికి ఎన్నో అవస్థలు పడుతుంటాడు. అందులో తన నోటి మాటలను అక్షరాలుగా మారుస్తుంటాడు.

"నువ్వు ఊరికి వెళ్ళిపోతే... ఎప్పుడు వస్తావో అని చూస్తున్నాను..." అని రాశాడు.

చదివి ప్రశాంతి నవ్వుకుని ఆ అక్షరాలను చెరిపి 'నాకు కూడా అలాగే అనిపించింది!' అని రాసింది.

ఆ తర్వాత ఆమె ఆ గదిలో సామాన్లు, పుస్తకాలను ఒక క్రమ పద్ధతిలో సర్దింది.

మళ్ళీ దగ్గరికి వచ్చి – "బీచ్‌కు, సినిమాకు వెళ్ళరా?" అని రాసింది.

అది చదివి నగేష్ పలక అందుకున్నాడు.

అక్షరాలు రాస్తుంటే చేతులు సహకరించలేదు.

గుండెల్నిండా దుఃఖం తన్నుకు వచ్చింది.

కంటి నుంచి నీటి బొట్టు రాలి.... రాసిన పలక మీద జారాయి...

"అంకుల్ ఏడుస్తున్నారా?.... సారీ!" అంది.

ఆ తర్వాత ఏమీ మాట్లాడలేదు. తనతో తెచ్చిన తెల్లకాగితాల పుస్తకం మీద స్కెచ్ పెన్‌తో రకరకాల బొమ్మల్ని గీసి నగేష్‌కు చూపించింది.

నగేష్ రైటు మార్కులు పెట్టి వందకు వంద అని అక్షరాల్లో రాశాడు.

'థేంక్స్!' అంది ప్రశాంతి...

ఆ తర్వాత కొద్దిసేపు ఆ గదిలో ఆటలాడి వాళ్ళింటిలోకి వెళ్ళిపోయింది.

నగేష్ ఆ వెళ్ళిన వైపు చూస్తుండిపోయాడు..

ఆ తర్వాత పలక తీసుకుని నెమ్మదిగా దానిమీద రాశాడు... 'జీవితంలో ఓడిపోయాను... ఎన్నో కోల్పోయాను.. బతకలేక బతుకుతున్నాను... ఉద్యోగ బాధ్యత... విధి నిర్వహణ గొప్పవి... ప్రభుత్వ సర్వెంటుగా పని చేశానన్న తృప్తి నాకు ఉంది... ఈ తృప్తి నాకు కొత్త జీవితాన్ని ఇవ్వకపోవచ్చు.. నేను చేసినది మంచి పని... అనే ఆత్మ సంతృప్తి కలిగించింది... అదే నన్ను నడిపిస్తోంది..."

పలకమీద అక్షరాలు మరోసారి చదువుకుని సంతృప్తిగా నిట్టూర్చాడు....

◆

సిండికేట్

(19వ పేజీ తరువాయి)

ఎనక్కొచ్చేదేంది?" రోట్లో తలపెట్టి రోకటి పోటుకు వెరచినట్టు'. భయపడితే పనికాదుకాని, ఓ పని చేద్దాం. మా సెక్షన్‌లో కొండల్‌రావు వడ్డీలకు తిప్పుతుంటాడు. వాణ్ణి అడిగి చూద్దాం ఓ యాభై వేలు తీసుకొంటే రెండు రూపాయల వడ్డీనే తీసుకొంటాడు.

ముందు ఆ గోడల మీద స్లాబ్ పడితే తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు. అవసరమైతే, చుట్టూ నాలుగు తడికెలు అడ్డుపెట్టుకొనైనా నీ ఇంట్లో నువ్వు ఉండొచ్చు. ఏమంటవ్!" అన్నాడు ఓ రోజు ముత్యాలరావు.

అనడానికి కూడా ఏమీలేని కుటుంబరావు ముత్యాలరావు సలహాతో కొండల్‌రావు దగ్గర మరో యాభైవేలకు బాకీదారుడయ్యాడు.

ఈ విషయం తెలిసిన సుబ్బారావు యూనియన్ ప్రెసిడెంట్ దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్ళి

"అన్నా! ఏందీకత? ఆ కుటుంబరావు గాడు కొండల్‌రావు గాడిదగ్గర ఖాతా పెట్టిండట. నువ్వు తీసికొచ్చినవని నేను డబ్బులిస్తే, అవి ఇయ్యకుండానే వేరే వాడి దగ్గర కొత్తబాకీ పెట్టిండు. మధ్యలో ఆ ముత్యాలరావుగాడొకడు.

ఏమాటకామాటే గాని కుటుంబరావు నెలనెలా ఇంటికొచ్చి వడ్డీ ఇచ్చి పోతడన్నా! అట్లాంటోణ్ణి మనం పోనిస్తే ఎట్లా?

ఆ కొండల్‌రావు గాడికి, మనకు నెలనెలా ఒకేసారి వడ్డీలు ఇప్పటి మాదిరి ఇవ్వలేడన్నా. నువ్వు ఆ కొండల్‌రావుగాణ్ణి సాయంత్రం పిలిపించు మాట్లాడుదాం"

పర్యవసానంగా ఆ సాయంత్రం ప్రెసిడెంట్, సుబ్బారావు, కొండల్‌రావు 'స్వప్నలోకం'లో సిట్టింగ్ పెట్టారు.

"నిజంగా ఆ కుటుంబరావు, సుబ్బారావు క్యాండెట్ అని తెలియదు. ఆ ముత్యాలరావు తీసుకొస్తే ఇచ్చినన్నా. ఇప్పుడు నువ్వెట్లా చెబితే అట్లా ఇంటానన్నా" అన్నాడు కొండల్‌రావు.

"దీంట్లో చెప్పేదేముంది గురూ! మీరూ, మీరూ మంచిగ వ్యాపారాలు చేసుకోండి. ఎవరి కస్టమర్లు వాళ్ళే చూసుకోండి. మీలో మీకు పోటీలు రాకుండా చూసుకోండి" ఖాళీ గ్లాస్ కింద పెడుతూ అన్నాడు యూనియన్ ప్రెసిడెంట్.

"ఆ కుటుంబరావుగాడి సంగతి ఇప్పుడేం చేద్దాం చెప్పన్నా" అంటూ సుబ్బారావు ప్రెసిడెంట్ ఖాళీ గ్లాస్‌లో మందుపోసి షోడా కలుపుతూ, కొండలరావు కేసి చూశాడు.

"చేసేదేంది గురూ! రేపొద్దున్నే కొండల్‌రావు ముత్యాలరావు ఇంటిముందు కూర్చొని, కుటుంబరావుకి ఇప్పించిన డబ్బులు అర్జంట్‌గా కావాలంటాడు."

"వాడింటి ముందుకూర్చుంటే ఏం లాభమన్నా?! డబ్బులివ్వాల్సింది కుటుంబరావైతే!" అన్నాడు సుబ్బారావు మెల్లగా మందుపని చేస్తుంటే.

"అదే మరి తెలివంటే. ఆ ముత్యాలరావుగాడు వట్టి గొడ్డుమోతు గేదెలాంటి వాడు వాడి. దగ్గర పైసా ఉండదు. కొండల్‌రావు వాణ్ణి ఒత్తిడి చేస్తే, వాడు కుటుంబరావు మీద వడతాడు. అప్పుడు ఆ కుటుంబరావుగాడు 'పాము ఎన్ని మెలికలు తిరిగినా బొక్కలోకే' అన్నట్టు నా దగ్గరకొస్తాడు. అప్పుడు చూపిస్తా నా తడాఖా ఏమిటో"

"మరి నువ్వేమంటావ్ కొండల్ బై!" అన్నాడు సుబ్బారావు.

"అనేదేముందిబై. అన్న చెప్పినట్టు చేద్దాం. మన యాపారాలు సాగాలంటే మనం, మనం ఓ అండర్‌స్టాండింగ్‌కు రావాలిగా"

ఒక అమాయకుణ్ణి, మంచివాణ్ణి కుటుంబంతో సహా వీధుల పాలు చేయడానికి ఈ విధంగా సిండికేట్ జరిగిపోయింది.

అనుకున్నట్టుగానే కుటుంబరావు లబలబలాడుతూ ప్రెసిడెంట్ దగ్గర కొచ్చి "అన్నా! ఆ కొండలరావు ఇల్లు కుంటానంటే ముత్యాలరావును మధ్యవుంచి యాభైవేలిచ్చాడు. మరిప్పుడు సడన్‌గా డబ్బులు కావాలంటున్నాడు అటు ముత్యాలరావు, కొండల్‌రావు నన్ను ఎక్కడా నిలువ నివ్వటం లేదు. ఏదో ఒకటి నువ్వే చెయ్యాలి" అన్నాడు.

"ఇప్పుడొచ్చి ఏదో ఒకటి చెయ్యమంటే ఏం చెయ్యాలి."

తీసుకొనేప్పుడు నేను గుర్తుకు రాలేదు. ఇప్పుడు అవసరమయ్యే సరికి అన్న కావాలి. ఇట్లుంటదండి పరిస్థితి.

"అన్నా! ఏదో జరిగిపోయింది. ఇప్పుడేం చెయ్యాలో చెప్పు"

"అరే! ఏంది? బై. ఇప్పటికిప్పుడు కట్టమంటే కట్టడానికి వందా, రెండొందలా! ఆ కొండల్‌రావుగాడి యవ్వారమే అంత. సాయం చేసినట్టే చేసి ఇరుకున బెడతాడు. నువ్వుండు వాళ్ళను పిలిపిస్తా" అంటూ కొండల్‌రావు, ముత్యాలరావులను పిలిపించాడు యూనియన్ ప్రెసిడెంట్.

"ఏమిటి? కొండల్‌రావు! ఇదేం బాగోలే. కుటుంబరావు అసలే పిల్లలు గలోడు. ఏదో అప్పో, సప్పో జేసి ఇంత గూడు కట్టుకుంటుండు. ఇచ్చినట్టే ఇచ్చి ఇప్పటికిప్పుడు ఇయ్యమంటే ఎక్కడ తెస్తాడు. అదీ వందా? వెయ్యా? తేవడానికి"? అంటూ ప్రెసిడెంట్ అందరూ వింటుండగా కొండల్‌రావుని అంటూ ఎవ్వరూ చూడకుండా కనుసైగ చేశాడు.

"లేదన్నా! నాకు అర్జంట్ అవసరమొచ్చింది. నేను ఇవ్వాల్సిన వాళ్ళు వచ్చి నా పీకల మీద కూర్చున్నారు. లేకపోతే అడక్కపోదును. కుటుంబరావు దగ్గర డబ్బులెక్కడికి పోతాయి" అంటూ కొండల్‌రావు లౌక్యంగా మాట్లాడాడు.

"ఏం ముత్యాల్‌రావు! మరి నువ్వేమంటావ్."

"అన్నా! నాదేముంది మధ్యలో ఉన్నా. మాట సాయం జేసిన."

"మరిప్పుడేం జేద్దాం కుటుంబరావు" అన్నాడు ప్రెసిడెంట్.

"ఏదో ఒకటి నువ్వే చెయ్యాలన్నా!"

"ఓ పని చేద్దాం" అంటూ కొంచెం సేపు ఆలోచించి ఫోన్ మీద సుబ్బారావును పిలిపించాడు.

సుబ్బారావు వస్తూనే..

"ఏందన్నా! సంగతి?

అరే! కుటుంబరావు, కొండల్‌రావులు కూడా ఇక్కడే ఉన్నారు" అంటూ ఏమీ తెలియనట్టే నటించాడు.

"ఏంలేదు సుబ్బారావు అర్జంట్‌గా నువ్వో యాభైవేలు కుటుంబరావుకి ఏర్పాటు చెయ్యాలి."

"అమ్మో! అన్ని డబ్బులా? నా దగ్గర లెవ్వన్నా? ఇంతకుముందే నువ్వు చెప్పినవనే పాతికవేలిచ్చిన. మళ్ళా యాభైవేలంటే కష్టమన్నా."

"ఓహో! అదా నీ భయం. అంత డబ్బు ఎట్లా తీరుస్తాడనా? వడ్డీ ఎట్లా కడతాడనా? నీకా భయమేం లేదు. కుటుంబరావు గురించి నీకు తెలియదా? పాపం గంగిగోవు లాంటివాడు. నువ్వు ఇవ్వక తప్పదు. కావాలంటే దానికేదైనా మార్గముంటే నువ్వే చెప్పు!" ప్రెసిడెంట్ ఇన్‌డైరెక్ట్‌గా సుబ్బారావుకి ఏదో హింట్ అందించాడు.

సుబ్బారావు కాస్సేపు తటపటాయించినట్లు నటించి

"అన్నా! నా జాగర్తకోసం అడుగుతున్నా. యాపారం అన్నాక, నా పద్ధతులు నాకుంటాయి. కుటుంబరావు గురించి నాకు మాత్రం తెలియదా?"

"సరే! అసలు విషయం ఏమిటో చెప్పు."

"ఏం లేదన్నా! కుటుంబరావు కడుతున్న ఇల్లు నా పేర తనఖా రాయించు. ఇస్తాను."

"ఏం కుటుంబరావు! ఏమంటావ్ మరి? నీ ఇష్టం ఎట్లుంటే అట్లనే."

'అనేదేముందన్నా! నా చేతుల్లో ఏముంది? అట్లానే చెయ్యి" అంటూ నిర్వేదంగా ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేశాడు.

పాపం! కుటుంబరావు ఇల్లు పూర్తికాక ముందే వడ్డీ వ్యాపారుల, నమ్మిన నాయకుని సిండికేట్ మూలంగా తనఖాలోకి వెళ్ళిపోయి శాశ్వతంగా అప్పుల్లో కూరుకుపోయాడు.

* * *

ఇదంతా అప్పుడే జరిగినట్టు కళ్ళల్లో మెదిలి పాపం కుటుంబరావు కళ్ళు తుడుచుకుంటూ, నడవలేక ఓ చెట్టు కింద కూలబడ్డాడు.

◆

ముదుసళ్ళ పండుగ..

శ్రీను, వాసు సినిమా కెళ్ళారు.

అది పౌరాణిక సినిమా. పైగా పాతది. పౌరాణికాల్లో ఆరితేరిన మహానటుడు నటించి, దర్శకత్వం నిర్వహించిన సినిమా కావడంతో ఆ సినిమా ఆడుతున్నది పాత థియేటర్ అయినా వెళ్ళారు వాళ్లిద్దరూ.

సినిమా స్క్రీన్‌ప్లే ఆద్యంతం ఆకట్టుకుంది. బయటికొచ్చాక అన్నాడు వాసు "ఇప్పటి గ్రాఫిక్స్‌కు సమానంగా...కొన్ని సన్నివేశాల్లో మించి మరీ బావున్నాయి కదా సీను!"

"అవును...అప్పటికి వున్న టెక్నిక్స్‌తోనే బెటర్‌గా తీసే ప్రయత్నం చేశారు వాళ్ళు" సినిమాను గుర్తుకు తెచ్చుకుంటూ చెప్పాడు శ్రీను.

"ఏదో విషయం శ్రీనూ....నాకు అర్థం కాలేదు...శ్రీకృష్ణుడు కౌరవులనుద్దేశించి ఒక డైలాగు అన్నాడు 'ముందున్నది ముదుసళ్ల పండుగ' అని. అది ముదుసళ్ళా....ముసళ్లా?" ఆసక్తిగా అడిగాడు వాసు.

"ముదుసళ్ళన్నా, ముసళ్ళన్నా ముసలాళ్ళేలేవోయ్... పక్కనెవరొస్తున్నారో మాటిమాటికీ అంత డిస్కషనేంటి?" పక్కనే నడుస్తున్న వెంకటేష్ అన్నాడు. అతనూ వాళ్ళ స్నేహితుడే.

"ఓం మవ్వారా...ఇంతకీ ముసలోళ్ళనేనా దాని అర్థం? మరి..ముసలోళ్ళ పండగేమిటి?"

ఏదోలేరా బాబూ పద... సినిమా చూశావుగదా! బాగుంది కదా కథ! "తెలియనివి తెలుసుకోనీవోయ్.." శ్రీను నవ్వుతూ అన్నాడు.

* * *

వాసు కొచ్చిన డౌటు అందరికీ రాకపోవచ్చు. అయితే వెంకటేష్ లాగా తోచిందేదో చెప్పి... సర్దేసే వాళ్ళు మాత్రం ఎక్కువే.

వాసు చెప్పినట్లు తెలుగులోని ఒక సూపర్‌హిట్ అయిన పాత సినిమాలో శ్రీకృష్ణుడు 'ముందున్నది ముదుసళ్ళ పండుగ' అని వ్యాఖ్యానం చేస్తాడు.

ఆ సినిమాలోనే కాదు. బయటకూడా ఈ పలుకుబడిని ఉపయోగిస్తాం. అయితే 'ముసళ్ళ పండుగ' అని వాడతాం. ప్రధానంగా పల్లెపట్టు పామర జనం దీనిని విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది పాపులర్ పలుకుబడి.

దీని వ్యుత్పత్తి ఎలా జరిగింది?దాని విపులార్థమేమిటి? అనేది తెలియకున్నా వాడకం మాత్రం అర్థవంతంగానే వాడతారు.

ఇది మహాభారత కథలోంచి పుట్టిందనేది ఎక్కువ మంది అభిప్రాయం. కురుక్షేత్ర యుద్ధానంతరం చాలా కాలానికి సముద్రంలో ఒక ముసలం పుట్టిందని, అది దొరికిన సందర్భంలో యాదవులు సంబరం జరుపుకుంటూ తమలో తాము కొట్టుకుని చనిపోయారని, ఆ ముసలాన్నే బాణం పుల్లగా ఉపయోగించి వదలగా అది తగిలి శ్రీకృష్ణుడు నిర్యాణం చెందాడనేది ఆ కథ. ఈ కథలోని 'ముసలం దొరికిన సందర్భంలో వారు జరుపుకున్న సంబరాన్నే' ముసలం పండుగ..ముసళ్ళ పండుగగా జనవాడుకగా మారిందనేది పరిశోధకుల అభిప్రాయం. ప్రస్తుతం ఆడింది ఆటగా పాడింది పాటగా ఉన్నవారిని..."ముందున్నది ముసళ్ళ పండుగ" అంటారు. అంటే రాబోయే రోజుల్లో కష్టాలుంటాయని వ్యాఖ్యానించడం.

ముసలాన్ని ముదుసలిగా అర్థం చేసుకున్న వాళ్ళు కాస్త గ్రాంధికంలో ముదుసళ్ళ పండుగగా పేర్కొంటున్నారు.

ఇలాంటిదే 'నల్లపూస' ప్రయోగం కూడా.

"ఏమిటి ఈ మధ్య బొత్తిగా నల్లపూసయ్యావు.." అనే మాట వాడుతుంటారు. దానికి..

"అవునండి... ఈ మధ్య బెజవాడెళ్ళాను.. అక్కడి ఎండలకు నల్లబడ్డాను" అనే సమాధానాలు వస్తుంటాయి.

మరికొందరు "ఈ మధ్య ఒంట్లో బావుండటం లేదండి.. అందుకే కాస్త సన్నబడ్డాను" అని చెప్తారు. ఈ రెండు సమాధానాలూ ఆ పలుకుబడి అసలు అర్థం తెలియకపోవడం వల్లే వచ్చాయి.

"నల్లపూసయ్యావు" అంటే "కనబడడం లేదు" అనేది అసలు అర్థం.

నల్లపూసకు, కనబడకపోవడానికి సంబంధమేమిటనే ప్రశ్న వస్తుంది. సంబంధం ఉంది.

నల్లపూస చాలా చిన్నగా ఉంటుంది. పైగా నల్లగానూ ఉంటుంది. సాధారణమైన వెలుతురులో ఇది కనబడదు. కాస్త వెలుగులోనే కనబడుతుంది. కాబట్టి "ప్రత్యేకించి దర్శించుకుంటే తప్ప సాధారణంగా నువ్వు కనబడడంలేదే!" అనేది భావం. ◆

పాఠక స్పందన

ఆద్యంతం ఆసక్తిదాయకం

జూన్ 29, 2003 ఆదివారం అనుబంధం ఆసాంతం చదివాను. పుస్తకమంతా చాలా చక్కగా ఉంది. ముఖ్యంగా 14 పేజీలో ప్రచురించిన 'ఎడారి ఓడ - రాకాసి పీడ' చాలా బాగుంది. పేరుపేరునా అన్ని శీర్షికలూ నాకు నచ్చాయి.

- సిహెచ్.వి.బి. ఆచార్యులు, మంగళగిరి, గుంటూరు

నిజంగానే సరస్వతీ పుత్రుడు

జూన్ 29 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రియల్‌స్టోరీ చాలా బాగుంది. చదువుకోవాలని పట్టుదల ఉండాలేకాని అంగవైకల్యం అడ్డుకాదని శంకర్ నిరూపించాడు. తల్లిదండ్రులు ఎవరూ లేకున్నా, పక్కవారు అవహేళన చేసినా, బతుకు భారమైనా గమ్యం చేరుకోవడానికి చదువుతూ ప్రయాణిస్తూనే ఉన్నాడు. అన్నీ ఉండి చదువుకోలేని వాడు సమాజంలో నిజమైన అవిటివాడు. అతను చదువును కొనసాగించేందుకు ప్రభుత్వం, అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు ఆర్థిక సహాయం అందజేయాలి. సరస్వతీ పుత్రుడు శంకర్ చదువుల్లో దిట్టగా విజయపతాకలు ఎగురవేయాలని ఆశిస్తున్నాము. ఎన్ని కష్టాలు వచ్చినా పట్టు వదలక చదువుపై అమిత శ్రద్ధ చూపుతున్న శంకర్‌కు హ్యాట్సాఫ్. ఇతడు పై చదువులు చదివి చక్కటి ఉద్యోగం వచ్చేలా ప్రభుత్వం తోడ్పడాలి. అతడు పైకిరావడానికి తోడ్పడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

- మామిండ్ల రమేష్‌రాజా,పాలకుర్తి,వరంగల్,

- ఎ. సతీష్‌బాబు,గజ్వేల్, మెదక్

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

మీ పిల్లల చదువు, క్రమశిక్షణ, ఆరోగ్యము మరియు ఉజ్వల భవిష్యత్తును గురించి విచారించకండి!

మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు
మేనేజింగ్ డైరెక్టర్

మాదల ప్రమీల రాణి
డైరెక్టర్

డా॥ మాదల సూర్యశేఖర్, M.B.B.S.
డైరెక్టర్-అకడమిక్

- 161 మంది విద్యార్థులు మాథ్స్‌లో 90-100 మార్కులు సాధించారు.
- 94 మంది విద్యార్థులు సైన్స్‌లో 90-100 మార్కులు సాధించారు.
- 500 లకు పైగా మార్కులు సాధించినవారు 112 మంది విద్యార్థులు.

S.S.C. 2003 లో 550 కి పైగా మార్కులు సాధించి రూ. 25,000/- చొప్పున నగదు బహుమతులు పొందిన మా విద్యార్థులు

Marks 558
E. Anusha Reddy
H.No. 0234821

Marks 557
Y. Satish
H.No. 234430

Marks 556
P. Vakula
H.No. 0235012

Marks 553
N.D.Y. Sampath
H.No. 234958

Marks 550
Y. Ahalya
H.No. 234833

7వ తరగతి కామన్ ఎగ్జామ్స్‌లో 550/600 లకు పైగా మార్కులు తెచ్చుకుని, ప్రస్తుతం 8 లేదా 9 లేదా 10వ తరగతులు చదవబోతూ, శ్రీ విశ్వశాంతిలో చేరగోరు విద్యార్థులకు పై మూడు తరగతులకు ప్రతి సంవత్సరం శ్రీ విశ్వశాంతి రూ. 30,000/- మెరిట్ స్కాలర్‌షిప్ ఇవ్వబడుతుంది.

సాధారణ విద్యార్థులతో కూడా అసాధారణ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ

- ప్రశాంతమైన గ్రామీణ వాతావరణంలో గత 28 సంవత్సరముల నుండి అంకితభావంతో ఎక్కడా బ్రాంచీలు లేకుండా స్వీయ పర్యవేక్షణలో నిర్విరామంగా కృషిచేస్తున్న ఏకైక విద్యాసంస్థ.
- శాస్త్రీయసంగీతం, వాద్యసంగీతం, వీణ, కూచిపూడి, భరతనాట్యం, మోడరన్ & వెస్ట్రన్‌డ్యాన్స్, కుంగ్‌ఫూ, కరాటే మరియు యోగా మొదలగువాటిలో శిక్షణ.
- సొంత డెయిరీ ఫామ్ కలిగి, హాస్టల్ విద్యార్థులకు పుష్టికరమైన ఆహారం.
- విశాలమైన క్రీడా ప్రాంగణంతో క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్న విద్యాసంస్థ.
- పబ్లిక్ పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు రు. 25,000/-ల నుండి రు. 1,50,000/-ల వరకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక నగదు బహుమతులు ఇస్తున్న విద్యాసంస్థ.
- 80 ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో, సువిశాల భవనాలతో స్థాపించబడినది.
- 6,7,8,9,10వ తరగతుల బాలబాలికలకు వేరు వేరుగా ప్రతి క్లాసులో టాలెంట్ సెక్షన్‌లు కలవు.
- 8,9,10వ తరగతుల నుండి టాలెంటెడ్ సెక్షన్‌లకు ఐఐటి ఫౌండేషన్ కోర్సు కలదు.
- ఐ.సి.యస్.ఇ & సి.బి.యస్.ఇ. సిలబస్ చదివిన విద్యార్థినీ, విద్యార్థులకు కూడా అడ్మిషన్లు కలవు.
- బాల, బాలికలకు వేరువేరుగా హాస్టలు వసతి కలదు.

• L.K.G. నుండి 10వ తరగతి వరకు • స్టేట్ సిలబస్ • కో-ఎడ్యుకేషన్

Y. Ahalya
H.No. 234833

Maths & Science
199/200
2nd State Place

K.S.M. Manikanth
H.No. 0234467

Maths & Science
198/200
3rd State Place

శ్రీ విశ్వశాంతి గోల్డ్‌మెడల్ విజేతలు S.S.C. 2003 లో మాథ్స్ మరియు సైన్స్‌లలో (199/200, 198/200) మార్కులు సాధించి స్టేట్ సెకండ్, థర్డ్ గా నిలిచిన మా విద్యార్థులు.

S.S.C 2003 లో ఉత్తీర్ణత 99%

S.S.C. 2003 లో పరీక్షలకు	
హాజరైన విద్యార్థుల సంఖ్య	352
ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య	347
ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	325
ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	20
తృతీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	2

ఇప్పటివరకు పరీక్షలకు హాజరైన	
మొత్తం విద్యార్థుల సంఖ్య	3,194
ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య	3,102
ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన సంఖ్య	2,573
ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులైన సంఖ్య	441
తృతీయశ్రేణిలో ఉత్తీర్ణుల సంఖ్య	88

ఈ అద్భుత విజయాలు సాధించిన మా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మరియు అధ్యాపక వర్గానికి మా హృదయపూర్వక శుభాభినందనలు...

శ్రీ విశ్వశాంతి - ఉయ్యూరు

Estd : 1975

ఇంగ్లీషు మీడియం స్కూల్ (Recognised by Govt. of A.P.)

ఉయ్యూరు - 521 165. విజయవాడ దగ్గర, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్స్: 08676-232962, 233292, 232964, 232818. సెల్: 98480 44059, 9440157895